ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

రంగా వర్సిటీలో పీజీ సీట్లకు
ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

21 పోస్టులతో 5 ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

6లో..



అమృత్ పథకంలో నరసరావుపేటలో నిర్మించిన వాటర్ ట్యాంక్

అమృత్.. అంతేనా

టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం

- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు
- మునిసిపల్ పరిపాలన విభాగంలో కదలని దస్త్రం
- పెరిగిన వ్యయం రూ 43.70 కోట్లు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

అమృత్ 2.0 పథకం అమలు అడుగు ముందుకు పడటలేదు. పురాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కారం కాక పౌరులు ఇక్కట్లు పడుతున్నా అమృత్ పనులు ఇప్పట్లో చేపట్టే పరిస్థితులు లేవు. రాష్ట్రంలోనే తొలి సారిగా అమృత్ పథకం 2.0 కింద చేపట్టే ప్రగతి పనులను నూతన విధానంలో చేపనున్నారు. ఇప్పటి వరకు జాతీయ రహదారుల నిర్మాణంలో వినియోగించిన పీపీపీని, మునిసిపాలిటీల్లో చేపట్టే ప్రగతి పనులకుఅమలు చేస్తోంది.

50 శాతం నిధులు ప్రభుత్వం ఇస్తోంది. 50 శాతం నిధులు కాంట్రాక్టర్ భరించాలి. సదరు సంస్థ ఖర్చు చేసే 50 శాతం నిధులను వడ్డీతో కలిపి 40 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మాణం, చెరువుల ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహించాలి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అమృత్ 2.0 పథకం పనులను ఒకే ప్యాకేజి కింద టెండర్ నిర్వహిస్తున్నారు. పనులకు సబంధించిన టెండర్ నిర్వహణ వాయిదాల పర్వంగా మారింది. ఇప్పటికే రెండు సార్లు టెండర్ వాయిదా వేసిన విషయం తెలిసిందే. ముచ్చటగా మూడోసారి టెండర్ పిలిచేందుకు అధికారులు సమాయత్తమైనా ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడంలేదు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల పరిధిలోని గుంటూరు నగరంతో సహా మునిసిపాలిటీల్లో రూ. 1092.40 కోట్ల వ్యయంతో పీపీపీ తరహా విధానంలో ప్రజారోగ్యం,మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ప్రగతి పనుల టెండర్‌ను పిలిచినా రెండు సార్లు వాయిదా పడింది. ప్రామాణిక రేట్లు పెరగడంతో పనుల వ్యయం రూ 1,136 కోట్లకు పెరిగింది.

గుంటూరులో వాయు కాలుష్యం

నివారణ చర్యలపై దృష్టి సారించాలి

- విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలి
- స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రకు ప్రాధాన్యం ఇవ్వాలి
- కలెక్టర్ల సదస్సు ముగింపులో సీఎం చంద్రబాబు
- రెండో రోజు కలెక్టర్, ఎస్పీలకు దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి



కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'వాయు కాలుష్యానికి గుంటూరు హాట్‌స్పాట్‌గా ఉంది. వాహనాల కాలుష్యం, నిర్మాణాలు, భవనాల కూల్చివేతలు, వ్యర్థ వాయువులు, క్వారీల్లో తవ్వకాలు, రోడ్ల పక్కన డంపింగ్‌తో పర్యావరణం కాలుష్యం అవుతుంది. కాలుష్య నివారణ చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.' అని కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాజధాని అమరావతి వెలగపూడి సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాజధాని జిల్లా అయిన గుంటూరుకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్, ఎస్పీలకు ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. ప్రధానంగా గుంటూరులో వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ఆర్టీసీ, ప్రైవేటు సెక్టార్‌లో విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గాలితో పాటు ఇతర కాలుష్యాలను కూడా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. చెట్ల విస్తీర్ణంలో గుంటూరు అట్టడుగున ఉందని, ఈ దృష్ట్యా కలెక్టర్ ప్రత్యేకించి ఈ అంశంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ నెలలో మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎంతో ప్రభుత్వ ఉన్నతాధికారులు కలెక్టర్‌కు సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాలను విస్తృతం చేయాల ఈ నెల 25న భారీ శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో రెండు సీవరేజ్ ట్రీట్‌మెంట్ల ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన 4.52 ఎకరాల భూమిని గుర్తించాలన్నారు. డోర్ టూ డోర్ గార్బేజీ కలెక్షన్‌లో 70 శాతం ఐవీఆర్‌ఎస్ సర్వేలో సానుకూల స్పందన వచ్చిందని దీనిని 100 శాతానికి తీసుకెళ్లాలని సూచించారు. వ్యక్తిగత కంపోస్టు పిట్ల నిర్మాణంలో జిల్లాకు కేటాయించిన 20,628 గుంతలను త్వరగా నిర్మించాలన్నారు. మేజిక్ డ్రెయిన్ల నిర్మాణం 75 శాతం పూర్తి అయిందని, మిగిలిన 25 శాతం పూర్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు. మత్స్య, ఆక్వా ప్రాసెసింగ్, వంటనూనెలు, సహజ ఇందనం, రిఫైనరీలు, ఫార్మా వంటి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వాలని తెలిపారు. మైనింగ్ ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ల సదస్సు చివరి రోజైన మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రెవెన్యూ, అటవీ, ఎక్సైజ్, స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అంశాలపై నోడల్ అధికారులు ప్రజంటేషన్ల ద్వారా వివరించి కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం తర్వాత శాంతిభద్రతల అంశంపై కలెక్టర్, ఎస్పీలతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు.



వెలగపూడి సచివాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు, (వెలగపూడి) సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు డీఎస్సీ నియామక పత్రాలు అందజేయనున్న ప్రాంగణంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. 19వ తేదీన వెలగపూడిలో రాష్ట్ర సచివాలయం దగ్గర ఎన్-9 రోడ్డు వద్ద డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రా లు అందించే కార్యక్రమం జరుగనుంది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సంబంధిత ఏర్పాట్లను ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలిలతో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ప్రధాన వేదిక, పార్కింగ్ తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌లను, బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తగు సూచన బోర్డులు ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తుళ్లూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ మురళీకృష్ణ, జిల్లావిద్యాశాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



6

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

వానొస్తే వణుకే

- వర్షం పడితే తటాకాల్లా రహదారులు
- నగరంలో ఎక్కడికక్కడ రాకపోకలు బంద్
- కొద్ది వర్షానికే స్తంభించిపోతున్న జనజీవనం
- 'హైడ్రా'తోనే గుంటూరులోనూ ముంపు నివారణ



కొరిటెపాడు సెంటర్లో..



బ్రాడీపేట 1వ లైనులో దుస్థితి



అరండల్ పేట 9వ లైను

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారీ తుపాన్లు.. కుండపోత వర్షాలను తట్టుకున్న నగరంగా గుంటూరుకు పేరున్నది. సముద్రమట్టానికి ఎత్తులో ఉండటంతో వరదలు వంటి వాటి నుంచి ఎలాంటి ముప్పు ఉండదు. అలాంటిది ప్రస్తుతం పట్టుమని 10 నిమిషాల వర్షం కురిసిందంటే నగర ప్రజానీకం చిగురుటాకులా వణికిపోతున్నది. ఓ మోస్తరు వర్షంతో ఎక్కడికక్కడ ప్రధాన రహదారులతో పాటు సందుగొందుల్లో మోకాలి లోతు నిలిచిపోతుంది. డ్రెయిన్లు ఉప్పొంగి ప్రవహిస్తూ పరిసర ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. ఈ కారణంగా వర్షం వెలిసిన మూడు, నాలుగు గంటల తర్వాతే వరదనీరు తగ్గి వాహనదారుల రాకపోకలకు వీలు కలుగుతుంది. ఆ మూడు, నాలుగు గంటలు గమ్యస్థానాలకు ఎటు వైపు నుంచి వెళ్లాలో తెలియక ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ సమస్య నుంచి ఎప్పటికి విముక్తి లభిస్తుందోనని ప్రజలు మథనపడుతున్నారు. కొరిటెపాడు, గుజ్జనగుళ్ల, గార్డెన్స్, చుట్టుగుంట, నేతాజీనగర్, నల్లచెరువు, చాకలిగుంట, ఎర్రచెరువు, రామనామక్షేత్రం, ఆర్అగ్రహారం శిలాలయంలోని కోనేరులు నగరంలో గొలుసుకట్టులుగా ఉండేవి. దీంతో భారీ వర్షం కురిసి వరదనీరు వచ్చినా వీటిల్లోకి చేరేది. ఒకవేళ ఇవి గరిష్ఠ నీటిమట్టానికి చేరుకుంటే అప్పుడు అదనపు వరదనీటిని పీకలవాగు, ఉప్పువాగు, కొండవాగు, మొండిగేటు డ్రెయిన్ల ద్వారా ఊరు బయటకు వెళ్లిపోయేవి. దీని వలన ముంపు సమస్య ఉండేది కాదు. అయితే నగరాభివృద్ధితో ఆ చెరువులు, డ్రెయిన్లు ఆక్రమణలకు గురైపోవడంతో వరద నీటి పారుదలకు ఆటంకాలు ఏర్పడి ఉపద్రవాలు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు నగరంలోని మేజర్ డ్రెయిన్లు అన్ని 15 అడుగుల వెడల్పు 10 నుంచి 15 అడుగులు లోతు ఉండేవి. డీఎఫ్ఐడీ ఫండ్స్‌తో పీకలవాగుని లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు నుంచి సంపత్‌నగర్ వరకు అభివృద్ధి పేరుతో వెడల్పు, లోతుని తగ్గించేశారు. డ్రెయిన్ల సైజు తగ్గించడంతో పోరంబోకు భూమినంతా ఆక్రమించేసి చాలామంది ఇళ్లు నిర్మించారు. ఈ కారణంగా సిల్టు భారీగా పేరుకుపోయింది. పైగా కొన్ని దగ్గర్ల శ్లాబులు నిర్మించారు. దీంతో వర్షం కురవగానే డ్రెయినేజీ నీరు అంతా రోడ్డు పైకి వచ్చేస్తోన్నది. వర్షం కురిసిన ప్రతీసారి నల్లపాడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీలు, రైతుబజారు, మార్కెటింగ్ కమిషనరేట్, మిర్చియార్డులోకి వరదనీరు ప్రవహిస్తున్నది. బ్రాడీపేటలో పీకలవాగు వెనక్కు తన్నుతుండటంతో ఒకటో లైను నుంచి నాల్గో లైను వరకు వరదనీరు చేరుతున్నది. మొండిగేటు తూములు చిన్నవి అయిపోవడం వలన పాతగుంటూరు, బాలాజీనగర్, వినోభానగర్, నెహ్రూనగర్, నందివెలుగురోడ్డులోని కాలనీల్లోకి మురుగునీరు చేరి రెండు రోజులు నిలబడిపోతున్నది. ఈ ముంపు సమస్య నివారణ చేయాలంటే హైదరాబాద్‌లో చెరువులు, డ్రెయిన్లను ఆక్రమించి నిర్మించిన ఇళ్లను హైడ్రా పేరుతో ఏ విధంగా అయితే తొలగిస్తున్నారో అదే విధానాన్ని ఇక్కడ కూడా అవలంబించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పరిష్కారం ఇలా...

- డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలి.
- వెడల్పు తగ్గించిన డ్రెయిన్లను పూర్వస్థితికి తీసుకెళ్లాలి.
- వరదనీరు చెరువుల్లోకి ప్రవహించే వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
- హైవేపై పీకలవాగును విస్తరించాలి.

బుల్లెట్ రైలుపై సర్వే

- ప్రాజెక్టు మట్టి నమూనాల సేకరణ
- ఎలైన్‌మెంట్‌పై జిల్లావాసుల్లో ప్రత్యేక ఆసక్తి
- చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమానులో డ్రిల్లింగ్



వట్టిచెరుకూరు పరిధిలో జరుగుతున్న మట్టి నమూనాల సేకరణ

గుంటూరు, వట్టిచెరుకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై వయా అమ రావతి రాజధాని హైస్పీడ్ ఎలివే టెడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ప్రాథమికంగా అవసరమైన ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) జిల్లాలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా డీపీఆర్ రూపకల్పన, ఫైనల్ ఎలైన్‌మెంట్ డిజైన్, ట్రాఫిక్ సర్వే రిపోర్టు, ఆర్‌వోఆర్ లెక్కలు, సవివర అంచనాలు, ఈపీసీ త యారు చేయడం వంటివి చేపట్టా రు. అలానే టెరెస్ట్రియల్ లిడార్ సర్వే(గ్రౌండ్ బేస్డ్ లేజర్ సర్వే) కూడా చేపట్టనున్నారు. ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో భారీ యంత్రాలను ఉపయోగించి మట్టి నమూనాలను సేక రిస్తున్నారు. దాదాపుగా 20 మీటర్ల లోతు వరకు వెళ్లి ప్రతీ ఐదు మీ టర్లకు ఒకసారి మట్టి నమూనా తీసుకుని ప్యాకెట్లలో నింపి వాటిని టెస్టింగ్ నిమిత్తం హరియాణా రాష్ట్రంలోని గురుగ్రాం లేబొరేటరీకి తరలి స్తున్నారు. దీంతో ఎలైన్‌మెంట్ ఏ ఊళ్ల మీద నుంచి ఉంటుందనే ఆసక్తి సర్వత్రా నెలకొన్నది. దేశంలో మొట్టమొదటి హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ అయిన అహ్మదాబాద్ - ముంబై సెక్షన్ పూర్తి కావొస్తుండటంతో ఎన్‌డీఏ-3 ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ - అమరావతి - చెన్నై సెక్షన్‌లో దీనిని నిర్మించాలని ఇప్పటికే ప్రాథమికంగా నిర్ణయించింది. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ నుంచి ఎయిర్‌పోర్టు మీదగా హైదరాబాద్ - చెన్నై ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని ఎలైన్‌మెంట్ చేయాలని ప్రతిపా దించింది. ఫ్యూచర్ సిటీ నుంచి ప్రారంభమై శంషాబాద్, నార్కెడ్‌పల్లి, సూర్యపేట, కోదాడ, అమరావతి రాజధాని, గుంటూరు, చీరాల మీదగా చెన్నైకి ఎలైన్‌మెంట్ చేయాలని భావిస్తున్నారు. కాగా ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో మట్టి శాంపిల్స్ తీస్తుండటంతో ఎలైన్‌మెంట్‌పై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రైలుమార్గానికి సమాంతరంగా ప్రాజెక్టు చేపడితే భూసేకరణ ఖర్చు కొంతమేరకు తగ్గుతుందని రైల్వేశాఖ సూచించింది. అయితే చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో శాంపిల్స్ తీస్తున్న దృష్ట్యా ప్రస్తుత రైలుమార్గానికి సమాంతరంగా కాకుండా వేరే ఎలైన్‌మెంట్‌లో చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. ప్రస్తుతం సేకరిస్తున్న మట్టి నమూనాల పరీక్ష ఫలితాలు పాజిటివ్‌గా వస్తే ఎలైన్‌మెంట్ ఇటు వైపు నుంచే ఉంటుంది.

బార్లు కిటకిట

- బార్లు తగ్గినా వ్యాపారం పెరిగింది
- గతంలో ఉన్నన్ని లేకపోవడంతో రద్దీగా బార్లు
- గత నెలలో 99 బార్లలో రూ.6.62 కోట్ల అమ్మకాలు
- ఈ నెలలో 53 బార్లలో రూ.8.74 కోట్ల విక్రయాలు



గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బార్లు కిటకిటలాడుతున్నాయి. ఒకవైపు నష్టం వస్తుందని బార్ల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. అయితే ఉన్న బార్లలో వ్యాపారం జోరందుకుంది. గత నెల ఉన్న బార్ల సంఖ్యకు ఈ నెలలో అందుబాటులో ఉన్న బార్ల సంఖ్యతో చూస్తే సగానికి సగం తగ్గాయి. అయినా వ్యాపారం మాత్రం భారీగా పెరిగింది. కూటమి ప్రభుత్వ మద్యం పాలసీ మార్చింది. ఈ క్రమంలో బార్లకు గడువు ముగియడంతో గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే బార్ అండ్ రెస్టారెంట్లు సక్రమంగా సాగవని, నష్టం వస్తుందని వ్యాపారులు దరఖాస్తులకు ముందుకు రాలేదు. గత నెలలో నోటిఫికేషన్ రెండు సార్లు గడువు పెంచింది. ఈ నెలలో రీ నోటిఫికేషన్ జారీ చేసి మళ్లీ రెండు సార్లు గడువు పెంచింది. అయినా వ్యాపారులు బార్ల నిర్వహణకు ముందుకు రాలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో ఎక్సైజ్ అధికారులు ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులతో పాటు ప్రభుత్వ వర్గాలు, మద్యం వ్యాపారులను ఆశ్చర్యపరిచేలా బార్ల వ్యాపారం జోరందుకుంది. గుంటూరుతో పాటు, పల్నాడు జిల్లాలో బార్ల సంఖ్య చాలావరకు తగ్గినా వ్యాపారం ఏ మాత్రం తగ్గకపోగా పెరిగింది. గత నెలలో పాత బార్లు ఉన్నప్పుడు మొదటి రెండు వారాల్లో జరిగిన వ్యాపారంతో పోలిస్తే కొత్త లైసెన్స్ విధానం వచ్చాక నూతన బార్లు ప్రారంభించిన రెండువారాల్లో అమ్మకాలను బేరీజు వేయగా మద్యం అమ్మకాలు తగ్గాల్సిందిపోయి భారీగా పెరిగాయి. గుంటూరు జిల్లాలో గత నెల మొదటి 15 రోజుల్లో బార్లు 99 ఉండగా వాటి ద్వారా రూ.6.62 కోట్ల వ్యాపారం జరిగింది. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు 53 బార్లు మాత్రమే ఉండగా అందులో రూ.8.74 కోట్ల అమ్మకాలు జరిగాయి. వాస్తవానికి బార్ల సంఖ్య గత నెలలో కంటే ఈ నెలలో బాగా తగ్గాయి. వాస్తవానికి బార్ల సంఖ్య తగ్గితే అమ్మకాలు భారీగా తగ్గాలి. కానీ అమ్మకాలు జోరందుకున్నాయి.

దరఖాస్తులకు ఆసక్తి..

ఇంతకాలం బార్ల దరఖాస్తులకు ముందుకు రాని వ్యాపారులు ఈ నెలలో ఇప్పటి వరకు జరిగిన అమ్మకాలను చూసి మళ్లీ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. గుంటూరు, పల్నాడు జిల్లాలలో తిరిగి మరికొన్ని బార్లకు దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు 67 బార్లు ఖాళీగా ఉండగా, పల్నాడు జిల్లాలో 49 బార్లకు 30 బార్లకు దరఖాస్తులు రాలేదు. రీ నోటిఫికేషన్ ప్రకారం ఆయా బార్లకు దరఖాస్తు చేసేందుకు బుధవారంతో ముగియనున్నది. ఈ క్రమంలో మంగళవారం వరకు చూస్తే 14 బార్లకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. పైగా మంగళవారం బార్లపై సమీక్షించిన ముఖ్యమంత్రి అవసరమైతే పాలసీ మార్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో మరింతమంది ముందుకు వచ్చే అవకాశం ఉండటంతో చివరి రోజైన బుధవారం భారీగా దరఖాస్తులు పడతాయని అధికారులు భావిస్తున్నారు.

యువకుడి హత్య కేసులో 11 మంది అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో ఈ నెల 8న అర్ధరాత్రి పెంటేల మణికంఠ(27)అనే యువకుడి హత్య కేసులో 11 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, లాలాపేట సీఐ శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు నిందితులను మంగళవారం లాలాపేట పోలీస్‌స్టేషన్లో మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. రెండేళ్ల క్రితం జరిగిన గొడవను మనసులో పెట్టుకుని వినాయక నిమజ్జనం సందర్భంగా 8న అర్ధరాత్రి గాంధీనగర్‌లో యర్రం యశ్వంత్, మణికంఠలు గొడవపడ్డారు. ఈ క్రమంలో యశ్వంత్ స్నేహితులతో కలిసి కర్రలతో దాడి చేయడంతో మణికంఠ మృతి చెందాడు. సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు నిందితులను గుర్తించారు. బుధవారం వారు ఐపీడీకాలనీ సమీపంలో ఉన్నారని తెలిసి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చుట్టుగుంట కావేరినగర్ ఆరో లైనుకు చెందిన యర్రం యశ్వంత్, చుట్టుగుంట పరిధిలోని కొత్తకాలనీ 5వ లైన్‌కి చెందిన మారగాని వంశీసాయికృష్ణ, వికలాంగుల కాలనీ 2/2 కు చెందిన మాడుగల రోహిత్ సాయికుమార్, కమ్మ శేషయ్య గ్రౌండ్ ఒకటో లైన్‌కి చెందిన రక్కటిల గురవయ్య, ఎల్ఆర్‌కాలనీ ఆరో లైన్‌కి చెందిన వల్లభనేని గణేష్, కేవీపీ కాలనీ రెండో లైన్‌కు చెందిన షేక్ మునాఫ్, డంపింగ్ యార్డ్ ఎదురు ప్రాంతానికి చెందిన షేక్ ముస్తఫా, నల్లచెరువు 0/5కు చెందిన వేముల కళ్యాణ్‌కుమార్, యతిరాజులకాలనీకి చెందిన శేఖర్ నాగూర్ మస్తాన్‌వలి అలియాస్ బాబు, ప్రభుత్వ హైస్కూల్ ఎదురు రోడ్డుకు చెందిన రంగిశెట్టి వెంకటరమణ, అంకిరెడ్డిపాలెం రోటరీ కాలనీకి చెందిన అమృతపూడి సుధాకర్ తదితరులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఆదాయం పెంపునకు మార్గాలను అన్వేషించండి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ ఆఫ్ ట్రైనర్ శ్రీనివాస్ రెడ్డి

గుంటూరు సిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆదాయం పెంపునకు నూతన మార్గాలను అన్వేషించాలని మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీఓలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు వచ్చే పన్నుతో పాటు ఇతర ఆదాయం మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని సూచించారు. వీటిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. మాస్టర్ ట్రైనర్స్ వేమూరి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నాగరాజులు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో నాలుగో విడత ప్రవేశాలకు ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ ఏపీ డాట్ జీవో వీ డాట్ ఇన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐ తెనాలి, జిల్లా స్థాయి శిక్షణా కేంద్రము, ప్రభుత్వ ఐటీఐ గుంటూరులో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రావి చిన్న వెంకటేశ్వర్లు, 9391402683 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత

● పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం


ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సమస్త మానవాళికి రక్షణ కవచంలా ఉన్న ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ప్రాంతీయ పర్యావరణ ఇంజనీరు మొహమద్ నజీనా బేగం అన్నారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో ఐటీసీ, కాలుష్య నియంత్రణ మండలి, మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నజీనా బేగం మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరగడంతో ఓజోన్ పొరకు ప్రమాదం ఏర్పడిం దన్నారు. దీంతో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి పర్యావరణ సమతుల్యత దెబ్బతిం దన్నారు. రాబోతున్న విధ్వంసాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకం చేపట్టాలని పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కో ఆర్డినేటర్ డీ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఓజోన్ పొరపై దుష్ప్రభావం చూపే రసాయన సమ్మేళనాలన్నింటిని నియంత్రించి, విరివిగా మొక్కలను నాటాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఓజోన్ పొరపై డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ జ్యోత్స్నకుమారి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర జిల్లా సమన్వయ కర్త సంతోష కుమారి, ఐటీసీ ఎమ్ఎస్కే అండ్ ఫిన్‌ఫ్ సొసైటి ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణ, ఎన్జీవోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

14 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


14 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 588.30 అడుగులు ఉంది. ఇది 306.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7029 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,967 క్యూసెక్కులు, 14 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,10,908 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,63,104 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,42,576 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 1,49,318 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టునుంచి పులిచింతలకు 1,49,318 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కెవెంకటరమణ,ఈఈలు సుబ్రహ్మణ్యం,నాగరాజులు చెప్పారు.ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 9 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తి 1,41,165 క్యూసెక్కులు,రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం 8153 మొత్తంగా 1,49,318 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.సోమవారం అర్ధరాత్రి 12గంటలవరకు 0.063 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 1,44,096 క్యూసెక్కుల నీరొస్తుండగా రిజర్వాయర్ 75.45 మీటర్లమేర నీ రుండగా ఈ నీరు 7 టీఎంసీలకు సమానమన్నారు.


టెయిల్‌పాండ్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పశ్చిమడెల్టాకు 4513 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 4513 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమ ట్టం ఉండగా దిగువకు 25,375 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాలసబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు నీటివిడుదల నిలిపివేశారు. రేపల్లెకాల్వకు 1196 క్యూసెక్కులనీరు, తూర్పుకాల్వకు 376 క్యూసెక్కులనీరు,పశ్చిమకాల్వకు196క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 384 క్యూసెక్కులనీరు, కొమ్మ మూరు కాల్వకు 1818 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 44.08 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 87,314 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఐదు గేట్ల ద్వారా 1,20,548 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,37,548 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కోడెల ఆశయాలను నెరవేర్చాలి

● మెగా వైద్యశిబిరంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఆశయాలను నేరవేర్చాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని కోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా ఆసుపత్రిలో కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, విజయవాడ కామినేని ఆసుపత్రి, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె, నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 962 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో గుండె సమస్యలు ఉన్నవారిని 36 మందిని, నేత్ర సమస్యలు ఉండి ఆపరేషన్ ఆవసరమైన వారిని 302 మందిని గుర్తించడం జరిగింది. కామినేని ఆసుపత్రి నుంచి డాక్టర్ భార్గవి, డాక్టర్ వై నవ్యనాథ్ లు వైద్య సేవలు అంద జేశారు. శంకర నేత్రాలయం నుంచి డాక్టర్ రమ్య, సైదారావులు సేవలు అందజేశారు. ముందుగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ ఉన్నంత కాలం ధైర్యాన్ని, గౌరవాన్ని ఇచ్చి అండగా నిలిచిన నాయకుడు కోడెల శివప్రసారావు అని శివరామకృష్ణ అన్నారు. మిమ్మల్ని నేను కాపాడు కోవాలని, నన్ను నడిపించాలన్సిన బాధ్యత మీ అందరిమీద ఉందన్నారు. మా చిన్న వయస్సులోనే కలలో కూడా ఊహిం చనంత గౌరవాన్ని ఇచ్చిన కోడెల అభిమానులు మీరన్నారు. అనంత రం కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మాలపాటి ప్రభాకర్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, బొడ్డపాటి పేరయ్య, ఏడుకొండలు, వసుందర, కదం నాగజ్యోతి, గట్టుపల్లి సత్యనారాయణ, కొలికొండ కొండలు, మందాడి రవి, కొక్కి రాల శ్రీనివాసరావు, కొల్లి ఆంజనేయులు, మహిళలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డాక్టర్ కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కోడెల శివరామకృష్ణ తదితరులు

ఏపీ ఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పు


ఏవీవీఎస్ స్వామి
ఏపీ ఎడ్ సెట్ కన్వీనర్

ఏఎన్‌యూ సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉన్నత విద్యా మండ లి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా అనుబంధ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) కోర్సుల్లో ప్రవేశా లకు సంబంధించి ఏపీఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు మంగళవారం కన్వీనర్ ఆచార్య ఏవీవీఎస్ స్వామి తెలిపారు. వెబ్ ఆప్షన్స్ కళాశాలల ఎంపిక ప్రక్రియ ఈనెల 17వ తేదీ వరకు జరుగుతాయని, వెబ్ ఆప్షన్స్ కళాశాల మార్పు 18వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ప్రక్రియ ఈ నెల 20వ తేదీన జరుగుతుందన్నారు. 22 నుంచి బీఈడీ తరగతులు ప్రారంభమవు తాయన్నారు. ఆయా కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌గా రత్న షీలామణి



ఏఎన్‌యూ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులు, ప్రస్తుత వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కే రత్న షీలామణి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్‌గా నియమితు లయ్యారు. ఈ మేరకు జీవో ఎంఎస్ నెంబర్ 84 పేరుతో ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్లపాటు ఆమె పదవిలో ఉంటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కే రత్న షీలామణిని వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

స్పౌజ్ టీచర్లందరికీ బదిలీలు చేపట్టాలి: ఏపీటీఎఫ్

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లందరికీ అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి పాఠశాల విద్యాశాఖను కోరారు. గత నెలలో ఇచ్చిన అంతర్ జిల్లాల బదిలీల మార్గదర్శకాలకు అనుగుణంగా స్పౌజ్ కోటాలో బదిలీకి అనేక మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే ఆయా జిల్లాల్లో ఉండే ఖాళీలు, అవసరం, మిగులు ఆధారంగా కొన్ని దరఖాస్తులను ప్రభుత్వ అనుమతికి పంపకపోవడంతో ఆ టీచర్లు ఆవేదన చెందున్నారని పేర్కొన్నారు. దర ఖాస్తు చేసుకున్న అందరికీ కొత్త డీఎస్సీ నియామకాలకు ముందే బదిలీలు చేపట్టాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రంగా వర్సిటీలో పీజీ సీట్లకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పెంపు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 సంవత్స రానికి వివిధ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంబీఏ(ఏబీ), పీహెచ్‌డీ, ఎంబీఏ(ఏబీ-ఎస్ఎఫ్‌క్యూ) ప్రోగ్రాముల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 వరకు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి, హార్డ్ కాపీని వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా ఈ నెల 22లోగా వర్సిటీ రిజిస్ట్రార్‌కు అందించాలని సూచించారు.

మత్స్యశాఖ పథకాల అమలుకు మార్గదర్శకాలు జారీ

మత్స్యశాఖలో రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ గల లబ్ధిదారుల పథకం, ప్రాజెక్టులు సజావుగా అమలు చేయడానికి రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కొన్ని సవరణలతో మంగళవారం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. అలా గే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.50 లక్షల కంటే తక్కువ, రూ.50 లక్షల కంటే ఎక్కువ వ్యయంతో గ్రౌండింగ్ చేసిన యూనిట్లలో వాస్తవ పరిస్థితిని నిర్ధారించడానికి జిల్లా మత్స్యశాఖ అధికారి ఛైర్మన్‌గా కమిటీని నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది.

21 పోస్టులతో 5 ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ మంగళవారం ఐదు నోటిఫికేషన్లు జారీచేసింది. రెండు జూనియర్ లెక్చరర్, ఒక బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, అటవీ శాఖలో 13 డ్రాఫ్ట్స్ మెన్ గ్రేడ్-2 టెక్నికల్ అసిస్టెంట్, గ్రామీణ తాగునీటి విభాగంలో మూడు ఏఈఈ, ఉద్యాన శాఖలో రెండు హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికే షన్లు జారీచేసింది. ఇందులో మొదటి రెండు నోటిఫికేషన్లకు అక్టోబరు 7 వరకు, మిగిలిన మూడు నోటిఫికేషన్లకు 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

ఆహార ఉత్పత్తి రంగంలో మహిళలకు ప్రోత్సాహం

డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల రంగంలో ఔత్సాహిక మహిళలకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి చెప్పారు. గుంటూరులోని డీఆర్డీఏ కాల్‌సెంటర్ మీటింగ్ హాల్లో ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకంపై ఓరియంటేషన్, శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈ, సెర్ప్ సంయుక్తంగా పథకం సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ సంస్థల అభివృద్ధిని ప్రోత్సహించడం, ఆర్థిక సహాయం, సామర్థ్యాన్ని పెంచడం, మార్కెట్ సదుపాయాలతో పోటీతత్వాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుందని ఆమె తెలిపారు. ఎల్‌డీఎం మహీపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు లోన్స్ ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరం లేదని, వారి లోన్ రీపేమెంట్ రేట్ బాగా ఉందని తెలిపారు. నాబార్డ్ డీడీఎం శరత్ తదితరులు మాట్లాడారు. గుంటూరులో అక్టోబరు 27 నుంచి నవంబరు 5 వరకు గుంటగ్రౌండ్‌లో నిర్వహించు నేషనల్ సరస్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలని కోరారు.

బర్రెలు, గొర్రెలు అమ్మాలనే లక్ష్యాలను ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యానిమేటర్లకు బర్రెలు, గొర్రెలు, కోళ్లు, విత్తనాలు అమ్మాలనే లక్ష్యాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని యానిమేటర్ల ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. యానిమేటర్లకు మూడు ఏళ్ల కాల పరిమితి రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కారించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని డీఆర్డీఏ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ యానిమేటర్లకు గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. అనంతరం పీడీ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు శివకుమారి, పద్మ, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

గుంటూరు (విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం 'వరల్డ్ ఓజోన్ డే' సందర్భంగా అంతర కళాశాలల పరిధిలో విద్యార్థులకు వక్తృత్వం, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. కళాశాల వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వక్తృత్వం పోటీలలో ఏ.స్వరాజ్యలక్ష్మి (టీజేపీఎస్ కళాశాల), పి జయశ్రీ (సిమ్స్ కళాశాల), కె.భాగ్యరేఖ (జేకేసీ కళాశాల), కె.స్రవంతి (సైంటెన్స్ కళాశాల) ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. పోస్టర్ ప్రజెంటింగ్ పోటీలలో ఎస్‌కే నజ్రీన్ (టీజేపీఎస్ కళాశాల), ఎం.అనూష (విజ్ఞాన్ డిగ్రీ కళాశాల), జి.నవ్యశ్రీ (సెయింటెన్స్ మహిళా కళాశాల), కె వినయ్ చరణ్ (సిమ్స్ కళాశాల) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కామేశ్వరశాస్త్రి కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ కార్మికులకు దసరా బోనస్ విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సివిల్ కార్పొరేషన్ లోని ఎంఎల్ఎస్ పాయింట్‌లలో పని చేస్తున్న ముఠా కార్మికులకు దసరా బోనస్, స్వీట్ బాక్స్ అందజేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసి) జిల్లా ఉప ప్రధాన కార్యాదర్శి రావుల అంజిబాబు కోరారు. ఈ మేరకు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కే తులసికి ఆయన వినతి పత్రం అందజేశారు. రావుల అంజిబాబు మాట్లాడుతూ పెరిగిన బోనస్ రూ.6,500, స్వీట్‌బాక్స్ రూ.1500 కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2020 తరువాత కార్మికులకు యూనిఫాం ఇవ్వలేదని, తక్షణమే మూడు జతల యూనిఫాం, వాటి కుట్టుకూలి రూ.2,100 మంజూరు చేయాలన్నారు. ప్రతి నెల 10వ తేదీలోపు కూలీ రేట్లు బిల్లు మంజూరు చేయాలని, పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉషా జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్-19 బాల, బాలికల విభాగాల్లో ఉషా జిల్లా జట్ల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అండర్-19 ఆర్గనైజింగ్ కార్యదర్శి జి నరసింహారావు మాట్లాడుతూ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికల్లో ఈ జట్టు పాల్గొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ బి.నరసింహారావు, పద్మాకర్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు: బి.అభిషిత్త, వెంకట శివశంకర్, అఫ్రోజ్, తన్వీర్, ఏ.యోగేష్ విశ్వనాథ్, డి.శ్రీసాహితీ, కే.సంధ్యారాణి, డీ.కీర్తన, వై.లక్ష్మీలావణ్య.

సంగీత వినీలాకాశంలో ధృవతార సుబ్బలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంగీత వినీలాకాశంలో ఓ ధృవతార ఎంఎస్ సుబ్బలక్ష్మి అని సంగీత విద్వాంసుడు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సుబ్బలక్ష్మి సంగీత ప్రపంచంలో అధిరోహించిన శిఖరాలు అనన్య సామాన్యమన్నారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, యార్లగడ్డ లక్ష్మీ, రాజేశ్వరి, ఘనశ్యామాచార్యులు తదితరులున్నారు.

నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించిన కోడెల

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్



కోడెల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, పార్టీ శ్రేణులు

గుంటూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవాతత్పరతతో ఎంతో మంది ప్రజలకు సేవలు అందించిన గొప్పనాయకుడు కోడెల శివప్రసాద్ అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. శాసన సభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పార్టీకి బలమైన నిబద్ధత కలిగిన నేత కోడెల అని, వైసీపీ ప్రభుత్వ వేధింపులకు బలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ దాసరి రాజామాస్టారు మాట్లాడుతూ కోడెల శివప్రసాదరావు మంచి మనసున్న డాక్టర్ అని ఎంతో మంది పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, కసుకుర్తి హనుమంతరావు, సుఖవాసి శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, లక్ష్మి శైలజ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



గుంటూరులోని తన కార్యాలయంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.



ఢిల్లీ నుంచి వచ్చిన స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నూరుశాతం చెత్త సేకరణ జరగాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతి ఇంటి నుంచి నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా 350 ఇళ్లను ఒక మైక్రో ప్యాకెట్ ప్రాతిపదికగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని, రానున్న కాలంలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మెరుగైన పర్యవేక్షణ చేయనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీల్లో స్థానం సాధించిన గుంటూరు నగరంలో చేపట్టిన ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి ఢిల్లీ నుంచి వచ్చిన స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు లఫ్లీ బన్సాల్, అనిరుద్ మార్వా, దీపక్‌లు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ తమ చాంబర్ లో కమిషనర్‌ని కలిసి తమ పర్యటన వివరాలు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు రెండు రోజులపాటు నగరంలో పర్యటించి, పారిశుధ్యం ఇతర అంశాలపై అధ్యయనం చేయనున్నారన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, డిప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య, ఎంహెచ్ఓ (ఇన్‌చార్జి) రామారావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతిరెడ్డి, ఐటీసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను రోడ్లమీద డంపు చేయొద్దు : కమిషనర్

నగరంలో చెత్తను రోడ్ల మీద, కాల్వల పక్కన, ఖాళీ స్థలాల్లో డంప్ చేయవద్దని, అలా వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం నగరంపాలెం, పాతగుంటూరు, కొత్తపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల వలన ప్రధాన రోడ్ల మీదకు మట్టి, ఇసుక వచ్చిన ప్రాంతాలను శుభ్రం చేయాలన్నారు. వర్షాలకు ఎక్కడైనా చెట్లు పడి ఉంటే వాటిని తొలగించడానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్వహణ సరైనది కాదు

- డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పది వైద్య కళాశాలలను పీపీపీ విధానం ద్వారా నిర్వహించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలోని జనచైతన్య వేదిక హాలులో పేదలకు వైద్య విద్య దూరమవాల్సిందేనా? అనే అంశంపై చర్చ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ విధానంతో ప్రతిభ గల పేద విద్యార్థులను శాశ్వతంగా వైద్య విద్యకు దూరం చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి లోక్‌సభకు ఒక వైద్య కళాశాల ఉండాలనే విధాన నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌కు 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు అనుమతిస్తూ 60 శాతం నిధులను కేటాయించిదన్నారు. కాని చంద్రబాబునాయుడు సరైన నిధులు లేవనే నెపంతో మెడికల్ కళాశాలలను పీపీపీ విధానానికి మార్చడాన్ని తప్పుబట్టారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ సేవారంగంలో ఉండాల్సిన విద్య వైద్య రంగాలను వ్యాపారమయంగా చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌యూ న్యాయ విభాగ విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.రంగయ్య, సామాజిక విశ్లేషకుడు టి.ధనుంజయ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి. చైతన్య, నాసర్‌జీ, యశ్వంత్, కొరివి వినయ్ కుమార్, ఓరుగంటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలా వెంకటేశ్వర్లు, వేదికపై కేఎస్ లక్ష్మణరావు తదితరులు

ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు తక్షణం పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

గుంటూరు (విద్య), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక, ఇతర సమస్యలు పరిష్కరించాలని, గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయు లకు అనేక హామీలు ఇచ్చి నమ్మించి రివర్స్ పీఆర్సీతో మోసం చేసినట్లే నేటి కూటమి వ్యవహరించడం తగదని ఏపీటీఎఫ్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ర్యాలీగా వచ్చి నిరసన ప్రదర్శన చేశారు. ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ సీపీఎస్ పై సముచిత ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి నేటికి 15 నెలలు గడిచినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ ఈహెచ్ఎస్ ఆరోగ్యమస్తు పథకంలోకి ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తింపజేసీ చెల్లింపుల పరిమితిని 25 లక్షలకు పెంచాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు మెమోరాండం సమర్పించారు.

తెలుగు సంస్కృత అకాడమి చైర్మన్ విల్సన్‌కు అభినందనలు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృత అకాడమి చైర్మన్ గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డీ విల్సన్ (శరత్ చంద్ర)కు మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంపాదకులు, రచయితలు, కవులు, బాషాభిమానులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం తరఫున ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని, కోశాధికారి నానా, సభ్యులు వశిష్ఠ సోమేపల్లి, ఆంజనేయరాజు వారిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. తెలుగు, సంస్కృత అకాడమి తమ హయాంలో తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించి గొప్ప పేరు ప్రఖ్యాతలు పొందాలని ఆకాంక్షించారు.

క్షవర వృత్తి దారులకు చట్టసభలలో స్థానం కల్పించాలి

- తాటికొండ నరసింహారావు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ వివక్షతకు గురైన క్షవర వృత్తిదారులకు చట్టసభలలో స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ సౌందర్య శాలల సంక్షేమ విభాగం గుంటూరు అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు స్థానిక నాయీబ్రాహ్మణ హాస్టల్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం వరల్డ్ బార్బర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కే.అంకమరావు మాట్లాడుతూ క్షవర వృత్తిదారుల విద్యార్థినీ, విద్యార్థులకు విద్యాపరంగా చేయూత ఇవ్వాలని, అప్పుడే ఈ జాతి మనుగడ ఉండగలదన్నారు. సౌందర్య శాలల సంక్షేమ విభాగం ఆర్గనైజర్ కే.బాజీ మాట్లాడుతూ బార్బర్ షాపులకు 200 యూనిట్లు ఉచితం విద్యుత్ జీఓ 69 ప్రభుత్వం విడుదల చేసిందని అధికారులు వెంటనే అమలు చేయాలని కోరారు. సభలో నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు అర్బన్ కమిటీ ప్రధాన కార్యదర్శి తిరువల్లూరు హరినాథ్ బాబు, నాయీబ్రాహ్మణ సంఘ సీనియర్ నాయకుడు అశ్విని వెంకటేశ్వర్లు, కొమ్మూరు మల్లికార్జున, బహుజన మహాసభ కేంద్ర కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, బహుజన పొలిటికల్ సెంటర్ కోఆర్డినేటర్ సాదు మాలాద్రి, బీసీ నాయకులు సిహెచ్ వాసు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



అయోధ్య రాముని రామబాణం, పాదుకలతో ఆలయ కమిటీ సభ్యులు

అయోధ్య రాముని రామబాణాన్ని సందర్శించిన భక్తులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చల్లా శ్రీనివాసశాస్త్రి తయారు చేయించిన అయోధ్య బాలరాముని కోదండం, రామబాణం, బంగారు పాదుకలు మంగళవారం భక్తుల సందర్శనార్థం ఉంచారు. దాదాపు 14 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో వీటిని తయారు చేయించారు. అనేక ప్రాంతాలలో భక్తుల సందర్శనార్థం ఉంచి అనేక ఆలయాలలో పీఠాధిపతుల పూజలందుకున్న బాలరాముని కోదండం, రామబాణం, బంగారు పాదుకలు త్వరలో అయోధ్యకు చేరనున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై 'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నాం


- టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ చిన్న బాజీ

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్టంపై 'సుప్రీం' తీర్పును స్వాగతిస్తున్నామని, చంద్రబాబు కృషితోనే జేపీసీ దృష్టికి వక్ఫ్ చట్ట సవరణలు జరిగాయని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ చిన్న బాజీ అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం సవరణలపై ముస్లిం వర్గాలలో నెలకొన్న ఆందోళనను దృష్టిలో పెట్టుకొని, వారి మనోభావాలకు అనుగుణంగా వక్ఫ్ చట్టంను జేపీసీ దృష్టికి వెళ్లేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని చిన్న బాజీ పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు షేక్ చిన్న బాజీ తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : శారదా కాలనీ కి చెందిన జెట్టి ప్రసన్న కుమార్‌పై పాతకక్షల నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ దాడి చేసాడు. వారిద్దరికి మధ్య గతంలో చిన్న తగాదాలు ఉన్నట్లు, ఈ క్రమంలో ప్రసన్నకుమార్ తన కుమారుడితో కలసి స్కూటీ మీద ఆరండల్‌పేట 1 వలైనులో వెళుతూఉండగా లక్ష్మణ్ చూసి వారిని తిట్టాడు. ప్రసన్నకుమార్ అడిగినందుకు లక్ష్మణ్ బూతులు తిట్టి కర్రతో కొట్టి గాయపరిచాడు. ప్రసన్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అరండల్ పేట ఎస్సై రోజా లతా తెలిపారు.

నేపాలీ బాలిక అదృశ్యం



నేపాలీ బాలిక

నేపాల్‌కి చెందిన గోవింద్ తాప అనే అతను కుటుంబంతో సహా హైదరాబాద్‌కి వలస వెళ్ళి హోటల్‌లో పనులు చేసుకుంటూ స్థిరపడ్డాడు. రెండు నెలల క్రితం అతని కుమార్తె(16), మరికొంత మందితో కలిసి గుంటూరు వలస వచ్చి గుంటూరు రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో పని చేస్తూ జీవిస్తుంది. ఈనెల 14నుండి సదరు బాలిక ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయింది. ఇంతవరకూ తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రోజా లతా తెలిపారు.

పెన్షనర్లు ఉపయోగించే ముఖ్యమైన సూచనలు

- ఈదర వీరయ్య

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఉపయోగించు ముఖ్య విషయాలు, జీవో నెంబర్ల గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో వివరించారు. ఒక వ్యక్తి రెండు పెన్షన్‌లు పొందునపుడు కరువు భత్యం ఒక దానిపై మాత్రమే వస్తుందన్నారు. రివిజన్ పెన్షన్ మంజూరైనపుడు కమ్యూటేషన్‌కు వైద్య పరీక్ష అవసరం లేదన్నారు. 15 సంవత్సరాల తరువాత కమ్యూటెడ్ పెన్షన్ మినహాయింపు రద్దు చేసి పూర్తి చేసి పెన్షన్ చెల్లించాలన్నారు. పెన్షన్ స్థిరీకరణకు ఉద్యోగి కడపటి నెల మూలవేతనం పరిగణలోకి తీసుకురావాలన్నారు. అదనపు వేతనం, మూల వేతనంకు కలిపి పెన్షన్ నిర్ణయించాలన్నారు. ఫ్యామిలీ పెన్షన్ ఉద్యోగి రిటైర్ కాకముందే వివాహితుడై ఉండాలని షరతు రద్దయిందన్నారు.

కవల పిల్లలకు కుటుంబ పెన్షన్ సమంగా పంచాలన్నారు. వివాహితుడై ఉండాలనే షరతు రద్దు చేయటం జరిగిందన్నారు. పదవీ విరమణ తేదీకి మరుసటి దినం ఇంక్రిమెంటు తేదీ అయినచో పెన్షన్ నిర్ణయానికి ఆ ఇంక్రిమెంట్‌ను కూడా పరిగణలోకి తీసుకోవచ్చన్నారు. 2000 జూలై ఒకటి ముందు రిటైర్ అయిన ఉద్యోగులకు ప్రథమంగా పీఆర్‌సీ నిర్ణయ కన్సాలిడేటెడ్ పెన్షన్ కరువు భత్యం విలీనం ప్రభుత్వం మంజూరు చేసిందని వీరయ్య తెలిపారు.

పాపం.. జ్యోతి

- మూడేళ్ల వయసు నుంచి అంధత్వం
- అండగా ఉన్న తల్లీతండ్రి మృతితో రోడ్డున పడిన వైనం
- ఎనిమిదేళ్ల కుమారుడి పోషణ కోసం భిక్షాటన
- సీఎం కరుణ కోసం అభాగ్యురాలి ఎదురు చూపులు



కుమారుడు సహాయంతో రోడ్డు మీద బిక్షాటన చేస్తున్న పాములపాటి జ్యోతి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

జీవితమంతా కష్టాలే అంటే పాములపాటి జ్యోతి జీవితమే నిదర్శనంగా కనిపిస్తోంది. పుట్టిన మూడేళ్లకే కళ్లు పోయాయి. కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిదండ్రులు హఠాత్తుగా మరణించారు. చేదువాదోడుగా ఉంటాడులే అనుకుని ఓ వ్యక్తి చెయ్యి పట్టుకుంటే బిడ్డ కడుపులో పడగానే వదిలేసి పత్తాలేకుండా పోయాడు. ఇప్పుడు ఆమె నడి రోడ్డు మీద ఉంది. ఎనిమిదేళ్ల బిడ్డను పోషించుకునేందుకు లోకాన్ని సరిగా చూడలేని ఆ తల్లి నానాయాతన పడుతుంది. మేడికొండూరు గ్రామానికి చెందిన జ్యోతి(ప్రస్తుతం గుంటూరులోని పాతగుంటూరు కృష్ణ కల్యాణ మండపం దగ్గర నివాసం ఉంటుంది) మూడేళ్ల వయసులో ఆడుకుంటూ కింద పడటంతో చూపు కోల్పోయింది. అప్పటి నుంచి తండ్రి మల్లేశ్వరరావు, తల్లి రమాదేవి కళ్లు లేని జ్యోతికి కళ్లుగా మారారు. 2007లో తండ్రి మల్లేశ్వరరావు గుండెపోటుతో మరణించిన తర్వాత జ్యోతి తల్లి మీదనే ఆధారపడ్డారు. 2018లో తల్లి రమాదేవి కూడా మరణించటంతో జ్యోతి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తల్లి, తండ్రి మరణించిన తర్వాత పూర్తి అయోమయ స్థితిలో ఉన్న జ్యోతిని వివాహం చేసుకునేందుకు ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. పెళ్లి చేసుకుని కొద్ది రోజులు కాపురం చేసిన తర్వాత చెప్పా పెట్టకుండా వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటికే తాను గర్భం దాల్చానని బాధితురాలు చెబుతున్నారు. అబార్షన్ చేయించుకోవాలని చాలామంది సలహా ఇచ్చినా జ్యోతి అంగీకరించలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత రక్షణకుమార్ అని పేరు పెట్టినట్టు వెల్లడించారు.

బిడ్డ కడుపు నింపటానికి బిక్షాటన...

ప్రస్తుతం పాత గుంటూరు కృష్ణ కల్యాణ మండపం సమీపంలోనిఅద్దె ఇంట్లో నివసిస్తున్న జ్యోతి ఎనిమిదేళ్ల బాబును పోషించుకునేందుకు బిక్షాటన చేస్తున్నారు. బిక్షాటన చేయగా వచ్చిన సొమ్ముతోనే బాబును పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ 'అడుక్కునే వాళ్ల' అనే పేరుతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తన బిడ్డను చిన్నచూపు చూస్తున్నట్లు జ్యోతి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఒక్కో రోజు రోడ్డు మీదకు వెళ్లాలంటే చాలా భయం వేస్తుందని ఆవేదన చెందుతున్నారు. 'రూపాయి ధర్మం చేయమని అడిగితే కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తారని వాపోయారు.

సీఎం కలవాలని ప్రయత్నం చేసినా...

జ్యోతి బయటకు రావాలంటే కచ్చితంగా ఎవరో ఒకరి సాయం ఉండాల్సిందే. అటువంటి పరిస్థితిలో కూడా మూడు, నాలుగు సార్లు సీఎంను కలవడానికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితురాలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ దగ్గరికి వెళ్లినా కూడా అదే అనుభవం ఎదురైందని చెబుతున్నారు.

సీఎం సర్ కనికరించాలి...

ఇప్పటి వరకు ఎన్నో కష్టాలు పడ్డాను. ఇక నా వల్ల కావడం లేదు. సీఎం సర్ దృష్టికి నా విషయం వెళ్తే ఆయన కచ్చితంగా న్యాయం చేస్తారు అన్న నమ్మకం నాకు ఉంది. ప్రస్తుతం ఆయన ఇచ్చే ఆరు వేలు పెన్షన్‌తోనే ఇంటి అద్దె మూడు వేలు, కరెంట్ బిల్లు వెయ్యి చెల్లించి జీవిస్తున్నాను. సీఎం స్పందించి ఇల్లు, బిడ్డ చదువుకి సాయం చేస్తే ప్రశాంతంగా ఉండగలుగుతాను. ఆర్థిక సహాయం చేయాలనుకుంటే 8341233852 నెంబర్‌లో సంప్రదించండి.

-పాములపాటి జ్యోతి, బాధితురాలు

గుంటూరు క్లబ్ కార్యదర్శిగా చుక్కపల్లి రమేష్



ఏకగ్రీవమైన గుంటూరు క్లబ్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్, పూర్ణచంద్రరావు కార్యవర్గ సభ్యులు

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గుం టూరు క్లబ్ కార్యదర్శిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త, పయనీర్ సంస్థల అధినేత చుక్కపల్లి రమేష్ ఎన్నికయ్యారు. క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పాలకవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. క్లబ్ అధ్య క్షుడిగా వడ్లమూడి పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ పాతూరి కిరణ్‌చౌదరి కాగా కార్యదర్శిగా చుక్కపల్లి రమేష్, ట్రెజరర్‌గా భూపెన్ మామయ, ఈసీ సభ్యులుగా సూర్యదేవర తిరుమలదేవ్, వట్టిజిన్నల బ్రహ్మారెడ్డి, మైనేని వెంకటేశ్వరరావు, మోపర్తి నరేంద్రబాబు, డాక్టర్ రాజేష్ బృందావన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. గుంటూరు క్లబ్ 1929లో ఏర్పాటైంది. మరో మూడేళ్లలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనున్నట్లు కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు సభ్యులు అభినందనలు తెలిపారు.

నగరంలో భారీ వర్షం

- కంకరగుంట ఆర్‌యూబీ, మూడు వంతెనల వద్ద రాకపోకలకు అంతరాయం

గుంటూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. రోడ్లపైకి భారీగా వర్షం వచ్చింది. వరుసగా వర్షాలు కురవడంతో మూడు వంతెనల వద్ద, కంకర గుంట రైల్వే అండర్ బ్రిడ్జిలో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగరంలోని అన్ని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరి చెరువులాగా మారాయి. నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై వర్షం నీరు నిలబడి పోయింది. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బ్రాడీపేట 2/10 లైనులో నిలిచిన వర్షపు నీరు



బ్రాడీపేట 1/12 లైనులో...



లక్ష్మీపురం రోడ్డులో నిలిచిన నీరు

జొన్నలగడ్డలోని ఆలయంలో హుండీ అపహరణ

గుంటూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో గల శివ నాగేంద్ర స్వామి ఆలయంలో హుండీని దొంగలు అపహరించుకుపోయారు. ఈ నెల 8న రాత్రి ఆలయానికి ఉన్న సీసీ కెమెరా వైర్లను పథకం ప్రకారం తొలగించారు. అనంతరం హుండీని అపహరించుకువెళ్లారు. అందులో సుమారు రూ.20 వేల వరకు కానుకలు ఉంటాయని ఆలయ ధర్మకర్త అల్లం మమత తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ప్రకాశం బ్యారేజి దిగువకు 43 వేల 500 క్యూసెక్కులు

● డెల్టా కాలువలకు 12 వేల 967 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న ప్రధాన వాగుల నుంచి 56 వేల 467 క్యూసెక్కుల వరదనీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 43 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 7440 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు ఛానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు.

నేటి నుంచి శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం

దుగ్గిరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని గ్రామ సచివాలయం -1 నందు శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు పంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ వివేకానంద తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం, బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఆధార్‌నమోదు సేవలను సద్వినియోగించుకోవాలని గ్రామస్థులను కోరారు.

గుండిమెడలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న కొమ్మారెడ్డి కిరణ్

తాడేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం గుండిమెడలో మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంజూరైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఇద్దరికి టీడీపీ తాడేపల్లి మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ అందజేశారు. క్రోసూరు సీతకు రూ.3లక్షలు, కొమ్మారెడ్డి వెంకటలక్ష్మికి రూ.40288లు చెక్కులను కిరణ్ అందజేశారు. బాధితులకు అండ గా సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు, సాంబశివరావు స్థానికులు పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక వృద్ధిలో ఎంఎస్‌ఎంఈలదే కీలకపాత్ర

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈలు దేశ సామాజిక ఆర్థికవృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ఇండస్ట్రియల్ ప్రమోషనల్ ఆఫీసర్ కె.నాగేంద్రబాబు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంటీఎంసీ కమిషనర్ సారథ్యంలో తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఎంఎస్‌ఎంఈల రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలు ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు దేశంలోని మారుమూల ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి దోహదం చేస్తున్నాయన్నారు. ఉద్యం రిజిస్ట్రేషన్లు చేసి, వాటి ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఉండవల్లి డీసీసీ బ్యాంకు మేనేజర్ మాధవి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈ) ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4 పథకం కింద విద్యార్థినికి ఆర్థికసాయం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థినికి పీ-4 బంగారు కుటుంబంలో భాగంగా టీడీపీ నాయకులు ఆర్థికసాయం అందించారు. మంగళగిరి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన అందె నాగసాయి స్రవంతి ఆర్థిక సమస్యలతో చదువు కొనసాగించేందుకు ఇబ్బంది పడుతుంది. విషయం తెలుసుకున్న ఆ వార్డు టీడీపీ కమిటీ సభ్యుల సహకారంతో రూ.20 వేలను సేకరించి మంగళవారం స్రవంతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే.శకుంతల మాట్లాడుతూ పీ-4 పథకం కింద ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, నేతలు జంజనం వెంకట సుబ్బారావు, తిరువీధుల సతీశ్, , వంగర హనుమాన్, వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలు కార్పొరేషన్ల డైరెక్టర్లకు సత్కారం


పలు కార్పొరేషన్ల డైరెక్టర్లను సత్కరిస్తున్న వల్లభనేని వెంకట్రావు, నేతలు

తాడేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఇటీవల రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మహమద్ ఇబ్రహీం, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుద్దంటి నాగేశ్వరరావు, మంగళగిరి మార్కెట్ యార్డు డైరెక్టర్ ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ మస్తాన్ (దుబాయ్) నియమితులైన వారిని పార్టీ పట్టణ కార్యాలయంలో అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు డైరెక్టర్లను మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దానబోయిన సుందరరావుయాదవ్, అద్దంకి మురళి, షేక్ చాంద్ బాషా, సైదా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు శుభ్రంగా ఉండటమే లక్ష్యంగా పనిచేయాలి

● డీఎల్‌పీవో శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డీఎల్‌పీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం వద్ద గల సుప్రీమ్ ఎల్‌టీసీలో రెండో రోజు జిల్లాలోని పలు మండలాలకు చెందిన సిబ్బందికి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో మీరు నిరంతరం కృషి చేస్తూ ఉండాలన్నారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్తలను గ్రామంలో సేకరించే విధానంతో పాటు వర్మీ కంపోస్టు తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఖాజా, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే భూసేకరణ : తహసీల్దార్ హేనాప్రియ

పెదనందిపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు భూసేకరణ చేపడతామని తహసీల్దార్ హేనాప్రియ అన్నారు. మండల పరిధిలోని రావిపాడు, జీజీపాలెం గ్రామల్లో గుంటూరు ఛానెల్ పొడిగింపునకు భూసేకరణ కొనుగోలుపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. జీజీపాలెంలో ప్రభుత్వం ఎకరాకు రూ.30లక్షలు ఇస్తామని, అదనంగా మరో రూ.5లక్షలు చెల్లించాలని రైతులు కోరారు. రావిపాడులో ఎకరాకు ప్రభుత్వం రూ.20లక్షలు చెల్లిస్తుందని తెలపగా రైతులు అదనంగా మరో రూ.20లక్షలు ఇవ్వాలని రైతులు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ సాహితీమోహన్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సెక్రటరీలకు ఓటర్ల జాబితా సవరణ అధికారం ఉంది

● తహసీల్దార్ సుజాత

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వార్డుల వారీగా ఓటర్ల జాబితా సవరణ చేసే అధికారం ఆయా గ్రామాల సెక్రటరీలకు ఉందని తహసీల్దార్ సుజాత తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రస్తుతం ఒక వార్డు పరిధిలో ఉంటున్నా మరో వార్డులో ఓటుగా నమోదై ఉందని, దీనితో ఒకే కుటుంబంలో ఇద్దరు వేర్వేరు వార్డుల్లో ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు తెలిపారు. 2019లో జరిగిన ఓటర్ల జాబితా సవరణలో సాఫ్ట్‌వేర్ వల్ల ఈ విధంగా జరిగిందంటూ ఆమె వివరణ ఇచ్చారు. ఓటరు కార్డులకు ఆధార్ జత చేయడం వల్ల డూప్లికేట్ ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని, ఈ ప్రక్రియ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లీబిడ్డల అప్పగింత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండున్నరేళ్ల క్రితం తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకీని మంగళగిరి రూరల్ పోలీసులు కనుగొన్నారు. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన తోకల తిరుపతమ్మ, కుమారుడు మోక్ష శ్రీనాథ్, స్నేహశ్రీలతో కలిసి 2023, ఏప్రిల్ నెలలో ఇంటి వెళ్లిపోయింది. వీరి అదృశ్యంపై తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన తిరుపతమ్మ తల్లి కట్టా లక్ష్మీ మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తిరుపతమ్మ, పిల్లలు శ్రీనాథ్, స్నేహశ్రీలు బుడంపాడు గ్రామంలో ఉన్నట్టు గుర్తించి సోమవారం సాయంత్రం మంగళగిరి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం మహిళ, ఇద్దరు పిల్లలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, తాడిశెట్టి మురళీమోహన్ తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేసేందుకు పీఏసీఎస్ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రూరల్ మండలపరిధిలో పొత్తూరు సొసైటీ చైర్మన్ రెడ్డి కోటయ్య, డైరెక్టర్లు చంద్రమౌళి, కాళీ, ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తాడిశెట్టి మురళీమోహన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ సొసైటీలో రైతులు అన్ని విధాలు లబ్ధిచేకూరేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఎరువులపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తుందని మండిపడ్డారు. అన్నదాతసుఖీభవతో పాటు రైతులకు అనేక పథకాలు ఇస్తున్నామని అన్నారు. తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ ఎరువులతో పాటు విత్తనాలు సకాలంలో పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సభ్యులను కోరారు. అనంతరం సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ దిగజారుడు రాజకీయం

తురకపాలెం ఘటనపై వైసీపీ దిగజారుడు రాజకీయం చేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మంగళవారం గ్రామంలో ఆయన పర్యటించారు. వైద్య పరీక్షలు, ప్రజలకు అందుతున్న తాగునీరు, ఇతర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంపై వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. అ సత్య ప్రచారాలు చేస్తే గట్టిగానే బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కోలాహలంగా సుబ్బారెడ్డి బాధ్యతల స్వీకరణ


పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన కుర్రి సుబ్బారెడ్డిని అభినందిస్తున్న గింజుపల్లి వెంకటేశ్వరరావు, కళ్లం రాజశేఖర్ రెడ్డి తదితరులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాతమల్లాయపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా నల్లిబోయిన అశ్విని, మిట్టనోల సంగీతమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పార్టీ నాయకులు సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి పదువుల దక్కుతాయని అందుకు నిదర్శనమే నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి పదవులు అందటం జరిగిందంటూ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, తెలుగురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కమిటీ సెక్రటరీ తాతిరెడ్డి లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంటారెడ్డి, అయినంపూడి నాగేశ్వరరావు, మేడవారిపాలెం సర్పంచ్ చెంచులక్ష్మి, కల్లూరి సుబ్బయ్య, మాకినేని జగన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్వార్టర్స్ పరిధిలో పోలీసుల తనిఖీ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని పాత రైల్వే క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పాత రైల్వే క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో రాత్రుళ్లు మద్యం మత్తులో యువకులు స్థానికులను భయపెడుతూ వీరంగం వేస్తున్నారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

మద్యం మత్తులో భార్య చెయ్యి నరికాడు

మేడికొండూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం, వెలవర్తిపాడు గ్రామంలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. మద్యం మత్తులో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త, ఆమె చేతిని కత్తిపీటతో నరికినట్లు మేడికొండూరు పోలీసులు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. వెలవర్తిపాడు గ్రామానికి చెందిన దాసరి రాజు (45), మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తన భార్య దాసరి రాణి (40)పై కొంతకాలంగా అనుమానం పెంచుకున్న రాజు రాత్రి వేళ తీవ్ర వాగ్వాదానికి దిగాడు. భార్య ఎదురు మాట్లాడటంతో కోపోద్రిక్తుడైన రాజు ఇంట్లో ఉన్న కత్తిపీటతో రాణి కుడిచేతిని నరికేశాడు. రాణి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో రాజు బయటికి పరిగెత్తాడు. నరికిన చేతిని ఒక సంచిలో వేసుకుని వెళ్లిన రాజు 108 అంబులెన్స్‌తో వచ్చి భార్యను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. రాజుపై మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది.

వెల్డింగ్ చేస్తుండగా గోడ కూలి కార్మికుడి మృతి

తుళ్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : వెల్డింగ్ చేస్తుండగా గోడ కూలి కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన తుళ్లూరు పాత పెట్రోలు బంకు సమీపంలో ఓ నిర్మాణ కంపెనీకి చెందిన పెట్రోలు ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. దీంతో మహారాష్ట్రకు చెందిన సందీప్ తుకారాం గంగతడే(29) మృతి చెందాడు. మృతుడితో పాటు సోదరుడు, బావమరది పని చేయటానికి వచ్చారు. సంఘటన జరిగిన ఆ రోజు ఉదయం 11 గంటల సమయంలో గోడ పక్కన దిగి గుంతలో నుంచి ట్యాంకర్‌కు సందీప్ వెల్డింగ్ చేస్తున్నాడు. బ్రిక్స్ రాయి గోడ ఒక్కసారిగా కూలీ సందీప్ మీదపడింది. వెంటనే విజయవాడ ఓ ప్రవేటు హాస్పిటల్‌కు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సందీప్ మృతి చెందాడు. సోదరుడు బాలషాబ్ తుకారాం గంగతడడే ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని బాలిక మృతి

తుళ్లూరు(హరిశ్చంద్రపురం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని బాలిక మృతి చెందిన ఘటన మండలపరిధిలోని హరిశ్చంద్రపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. తుళ్లూరు జడ్పీ పాఠశాలలో బాలిక పదో తరగతి చదువుతుంది. ట్యూషన్ నుంచి ఇంటికి వచ్చి హోంవర్క్ చేసుకుంటానని గదిలోకెళ్లి బాలిక ఈ దురాగతానికి పాల్పడింది. తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి కార్మికుడి మృతి

తుళ్లూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం నేలపాడు ఎన్జీవో క్వార్టర్స్ సమీపంలో జరిగింది. మృతుడు పశ్చిమ బెంగాల్‌కు రాష్ట్రానికి చెందిన బాపి బెహరా(32)గా తుళ్లూరు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

దుగ్గిరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తుమ్మపూడికి అంగన్‌వాడీ టీచర్ మోర్ల రాజ్యలక్ష్మి(55) గుండెపోటుతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎస్ సరిత, సూపర్‌వైజర్ ఎన్ భవాని, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మికి ఘనంగా నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు.

9 నెలలుగా జీతాలు చెల్లించడం లేదు

● గ్రామ సచివాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్‌ల నిరసన

కాకుమాను, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొమ్మూరులో మంగళవారం గ్రీన్ అంబాసిడర్‌లు విధులు బహిష్కరించారు. గ్రీన్ అంబాసిడర్‌లుగా గుళ్లపల్లి ఖయ్యూం, యేసోబు, తమలపాకుల రాంబాబు, గంటినపల్లి మోషే, మాణిక్యరావులు విధులు నిర్వహిస్తున్నారు. పంపు డ్రైవర్లుగా పర్చూరు కరీముల్లా, గేరా సత్యం, ఎలక్ట్రీషియన్‌లుగా తాజుద్దీన్, సచివాలయ స్వీపర్‌గా జ్యోతిలు తెలిపిన వివరాల ప్రకారం తొమ్మిది నెలల నుంచి గ్రామంలో పారిశుధ్య కార్మికులకు, అలాగే గ్రీన్ అంబాసిడర్‌లకు పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి జీతాలు చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో వారు విధుల బహిష్కరణతో పాటు గ్రామ సచివాలయం వద్ద ఫ్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

సేవా పక్షోత్సవాలు విజయవంతం చేయాలి

● బీజేపీ రాష్ట్ర నాయకులు జంధ్యాల

పెదనందిపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు జంధ్యాల రామలింగేశ్వశాస్త్రి అన్నారు. మండలపరిధిలోని వరగానిలోని బీజేపీ కార్యాలయంలో నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు వెలగా గంగాధరరావు, బీమినేని రవి, ఈద శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో బాలల హక్కుల వారోత్సవాలు

తాడేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్లో మంగళవారం చైల్డ్ హెల్ప్‌లైన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు మంగళగిరి ఆధ్వర్యంలో అధికారులు విద్యార్థులకు పోషణ, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ కె.చిన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ అత్యవసర హెల్ప్ లైన్ ఫోన్ నెం.1098 గురించి వివరించారు. మంగళగిరి ప్రాజెక్టు ఏసీడీపీవో సౌమ్య, హెచ్‌ఎం అనంతశివ, సూపర్‌వైజర్, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకాన్ని బాధ్యతగా అమలు చేయాలి

● ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు


ఉద్యోగుల అభినందన సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతగా అమలు చేయాలని ఆర్టీసీ వైస్‌చైర్మన్, ఎండీ సీహెచ్ తిరుమలరావు సూచించారు. మంగళగిరి ఆర్టీసీ డిపోను మంగళవారం ఆయన సందర్శించారు. మంగళగిరి కొత్త బస్టాండు, డిపో గ్యారేజీలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం జరిగిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో పాల్గొన్నారు. మంగళగిరి డిపో ఈనెలలో ఆరు మార్లు వందశాతం ఓఆర్, జీరో ఫెయిల్యూర్ సాధించినందుకు ఉద్యోగులు, సిబ్బందిని ఎండీ ద్వారకా తిరుమలరావు అభినందించారు. కార్యక్రమంలో ఈడీ(ఈ) చెంగలరెడ్డి, ఈడీ(ఓ) అప్పలరాజు, ఈడీ (జోన్) నాగేంద్రప్రసాద్, డీపీటీవో విమల, సీటీఎం జాన్ సుధాకర్, మంగళగిరి డిపో మేనేజరు పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వస్థనారీ స్వశక్తి పరివార్

దుగ్గిరాల, సెప్టెంబరు 16: దుగ్గిరాలలోని శ్రీసత్యసాయి కల్యాణ మండపం (బీపీ కల్యాణమండపం)నందు స్వస్థనారీ స్వశక్తిపరివార్‌లో భాగంగా ఉచిత స్క్రీనింగ్ పరీక్ష శిబిరం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రహ్మాన్ తెలిపారు. శిబిరాల నిర్వహణపై తహసీల్దార్ ఐ.సునీత, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్‌లతో చర్చించారు. ఈనెల 17వతేదీ నుంచి అక్టోబరు 2వతేదీ వరకూ అన్ని పీహెచ్‌సీల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● తాడేపల్లి ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష, అడిషనల్ కమిషనర్ జి.శకుంతల, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావులను కలిసి తాడేపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు శాంతకుమారి స్వస్థనారీ, స్వశక్తి పరివార్ బ్రోచర్లు అందజేశారు.

ప్రత్యేక శిబిరాలను మహిళలు సద్వినియోగించుకోవాలి

● వైద్యాధికారి నందకుమార్

పెదనందిపాడు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద ప్రభుత్వం స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ క్రింద ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి నందకుమార్ తెలిపారు. ఈనెల 17నుంచి అక్టోబరు 2వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు, ఈ శిబిరాల ద్వారా మహిళల ఆరోగ్యంపై అవగాహన, సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేయడంతో పాటు పలురకాల వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. మహిళలు శిబిరాలను సద్వినియోగించుకోవాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

కళాకారుడు గోపాలరావుకు ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శతాధిక నాటక గ్రంథకర్త కొడాలి గోపాలరావు సంస్మరణ సభ మంగళవారం ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరావుకు ఘనంగా నివాళి అర్పించారు. అమర కళాకారుల సంస్మరణలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆయన కళావైభవాన్ని హరికథా భాగవతార్ బి.నాగమణి వివరించారు. కొత్తకథలు సైతం రెండు రోజుల్లో రాయగలిగిన సమర్థత ఉందన్నారు. లంకెబిందెలు, కాంతా-కనకం, విశ్వనాథ విజయం వంటి పలు నాటికలు మంచి పేరు తెచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, శివపార్వతి, బాలస్వామి, యామిని పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

ప్రతి దరఖాస్తును పరిశీలించాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలి తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. వీఆర్వోలు, విలేజ్ సర్వేలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డుల కోసం పెట్టుకున్న ప్రతి దరఖాస్తును పరిశీలించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, మండల సర్వేయర్ హరికృష్ణ, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి ప్రత్యేక వైద్య శిబిరాలను నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని అన్ని వార్డుల్లో నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇ.అన్నపూర్ణ తెలిపారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమైన కుటుంబాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. మహిళల ఆరోగ్యం కాపాడే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రకటించిందన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, పౌష్టికాహార ప్రాధాన్యతను తెలియజేస్తామని, జబ్బులను గుర్తించి చికిత్సలు అందిస్తామన్నారు. ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ ఎరువులపై దృష్టి సారించాలి

● ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘు పేర్కొన్నారు. తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం రైతులకు నానో ఎరువులు, బీమా, డ్రోన్ సౌకర్యాలపై అవగాహన కల్పించారు. సంప్రదాయ ఎరువుల కంటే నానో ఎరువుల ప్రయోజనాలను వివరించారు. వరి, జొన్న, మొక్కజొన్న పంటల్లో నానో ఎరువులు సాధారణ ఎరువుల ప్రయోజనాలనే అందిస్తాయన్నారు. ఉచిత ప్రమాద బీమా సౌకర్యాలు, కిసాన్ డ్రోన్‌ల పథకం పట్ల అవగాహన కల్పించారు. ఏవో సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో పంచాయతీ భవనం వద్దు

● అధికారులకు గ్రామస్థుల వినతి

కొల్లిపర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ కాలనీలో పంచాయతీ భవనాన్ని నిర్మించవద్దు అని అధికారులకు గ్రామస్థులు మొరపెట్టుకున్న సంఘటన మండల పరిధిలోని దంతలూరులో చోటుచేసుకుంది. మంగళవారం తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి దంతలూరు బీసీ కాలనీలో పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించగా గ్రామస్థులు ఇక్కడ నిర్మించటానికి వీలులేదని తాము కల్యాణ మండపాన్ని నిర్మించుకుంటామని చెప్పి అధికారులను అడ్డుకున్నారు. దీంతో అధికారులు పంచాయతీ భవనం శంకుస్థాపనకు ఎస్సీ కాలనీలో మరో స్థలాన్ని పరిశీలించారు.

స్వస్థనారీ సశక్త్ పరివార్‌ను
విజయవంతం చేయాలి

● మండల వైద్యాధికారి నీహ

కొల్లిపర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఈ నెల 17వ తేదీన మున్నంగి, వల్లభాపురం, 18న తూములూరు, 19న చివలూరు, సిరిపురం, 20న దంతలూరు, 22న బొమ్మువాని పాలెం, 23న అన్నవరం, 24న దావులూరు, 25న కొల్లిపర-3, 26న వల్లభాపురం, 27న కొల్లిపర -1, 29న కొల్లిపర 2, 30న పిడపర్రు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడు శంకరరావుకు సన్మానం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడుగా ఎన్నికైన దేవరకొండ శంకరరావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, బాండెడ్ లేబర్ సిస్టమ్ అబోలేషన్ యాక్టు ప్రకారం కమిటీ ఏర్పాటయ్యిందన్నారు. ఎరుకల సేవ సంఘంలో కూడా ఆయన సేవలు అందించారని అభినందించారు. కార్యక్రమంలో బుల్లియ్య, నాగేశ్వరరావు, ఏడుకొండలు, రాజేష్, కాశేశ్వరరావు, గోపి, నాగరాజు పాల్గొన్నారు.

లలితమ్మ ఆశయ సాధనకు కృషి

● హెనీ క్రిస్టీనా, సురేష్‌కుమార్

చేబ్రోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలు కత్తెర లలితమ్మ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని జడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా, హార్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం గరువుపాలెం క్వారీ సమీపంలోని హార్వెస్ట్ ఇండియా జూనియర్ కళాశాలో లలితమ్మ జయంతిని ఘనంగా జరిగాయి. లలితమ్మ సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం జడ్పీ చైర్మన్ క్రిస్టీనా, డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ప్రతిభా అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఆమె పేరున స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రతినిధులు, నాయకులు, సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుక్కల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

● డీఎల్‌పీవో స్వరూపరాణి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు, 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోనున్నట్లు డీఎల్పీవో స్వరూపరాణి అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామాన్ని మంగళవారం డీఎల్‌పీవో సందర్శించారు. వీధి కుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన చిన్నారి కార్తీక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి స్థానిక పరిస్థితుల గురించి ఆరాతీశారు. గ్రామంలో యథేచ్ఛగా సంచరిస్తున్న కుక్కలను బంధించి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలని అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైతే పొన్నూరు పురపాలక సంఘం సహకారం కోరాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో మరో దుర్ఘటన జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రధానంగా చిన్నారులు సంచరించే ఆటస్థలాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల వద్ద కుక్కల సంచారాన్ని నిరోధించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో మల్లికార్జునరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


డ్రెయిన్లపై ఆక్రమణను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

డ్రెయిన్లను ఆక్రమిస్తే కఠినచర్యలు

● కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు, 16 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో డ్రెయిన్లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని ముబారక్ నగర్ 21వ వార్డులో మంగళవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో డ్రెయిన్లలను ఆక్రమించి నిర్మించిన పార్కింగ్ శ్లాబ్‌లను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. భవిష్యత్‌లో డ్రైనేజీలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజీలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వలన వాటిలో పేరుకుపోయిన సిల్టు తొలగింపు కష్టసాధ్యంగా మారుతుందన్నారు. సిల్టు తొలగించకపోవడం వలన మురుగునీరు ప్రవాహం కిందకు వెళ్లే మార్గంలేక రహదారులపైకి, గృహాలలోకి వస్తున్నాయన్నారు. దీనివలన పారిశుధ్య సమస్యలు తలెత్తి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలవలపై ఆక్రమణలను ప్రజలు స్వచ్ఛందంగా తక్షణమే తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బోరు బావుల సర్వే పూర్తిచేయాలి

తహసీల్దార్ జియావుల్‌హక్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్‌హక్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు, 16 (ఆంధ్రజ్యోతి): చిన్న నీటి వనరులైన బోర్లు, బావులు, చెరువుల సర్వేలు సత్వరమే పూర్తి చేయాలని తహసీల్దార్ జియావుల్‌హక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చిన్ననీటి వనరుల గణన, రెండో వాటర్ బాటిల్ సర్వేను నెలాఖరులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. సేకరించిన సమాచారాన్ని తక్షణమే ఎంఐ సెన్సస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వివిధ గ్రామాల్లో ఉన్న బోర్లు, బావులు చెరువులకు సంబంధించిన సర్వే నంబర్లను యాప్‌లో నమోదు చేయాలన్నారు. చిన్నతరహా నీటి వనరుల సమాచారాన్ని సంబంధిత బోరు బావి చెరువుల వద్దకు వెళ్లి యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఈ సర్వే ద్వారా కేంద్రం నుంచి నిధులు రాబట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ సర్వేని కేంద్రం ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, సహాయ గణాంకాధికారి ఎస్.ప్రసాద్, ఆర్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఇంజనీర్లు సాంకేతిక సాయం అందించాలి

● తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా


పుస్తకావిష్కరణలో పాల్గొన్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, యూనివర్సిటీ అధ్యాపకులు

పెదకాకాని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత దైనందిన జీవనంలో భాగం అయినందున ఇంజనీర్లు సమాజానికి అవసరమైన సాంకేతిక సాయం అందించాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా మంగళవారం అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్శిటీలో అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ (ఏసీఎం) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న స్పర్ధ-2కే25 సాంకేతిక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సంజనా సింహా ఈ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని, సాంకేతికతతో సమాజంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సాంకేతిక సహకారంతో యాప్‌ల రూపంలో పరిష్కారాలు చూపుతోందని వాటిపై అవగాహన కల్పించవలసిన బాధ్యత సాంకేతిక విద్యార్థులపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన వ్యవస్థాపకుల అవసరం ఉందని ఇంజనీర్లు వ్యవస్థాపకులుగా మారాలని సూచించారు. విద్యార్థులు స్పర్ధ వంటి సాంకేతిక సదస్సులో పాల్గొనడం ద్వారా పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన తాను ఓటమి నుంచి చాలా నేర్చుకున్నానని. విద్యార్థులు ఓటమి చెందినప్పుడు నిరాశ చెందక ఆలోచన చేసి విజయం వైపు సాగాలన్నారు. అనంతరం ఏసీఎం క్రానికల్ 2024 పుస్తకాన్ని సంజనా సింహా ఆవిష్కరించారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 210 గ్రూపులు, 1470 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమములో గేమ్ ఆఫ్ కోడ్, అల్గా ఆరీనా, ట్రెజర్ ట్రూపర్స్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు.

కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.రామచంద్రన్, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎ.కళావతి, సీఎస్ఎం విభాగాధిపతి డాక్టర్ కె.సురేష్‌బాబు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ బి.సాయిజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో వెస్ట్ జోన్
ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు



ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య వి.దివ్యతేజోమూర్తి వెల్లడించారు. ఈ పోటీ ఎంపికలకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 165మంది పాల్గొన్నారన్నారు. ఆయా విభాగాలలో 800 మీటర్ల పరుగుపందెం, మార్చ్ ఫాస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా ప్రతిభ నైపుణ్యం కనబరిచిన వారిని హైదరాబాద్ సెలెక్షన్ కమిటీ నిర్ణయిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి కె గంగాధరరావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో ఉన్న వలంటీర్లు దేశభక్తి, సాటి మనిషికి సహాయం చేసే తత్వాన్ని కలిగి ఉండలన్నారు. విద్యార్థులు కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాకూడదన్నారు. సామాజిక సేవలో ముందుకు వెళ్లాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో ప్రవేశించిన వలంటీర్లకు ఎన్నో గొప్ప అవకాశాలు వస్తాయన్నారు. రీజనల్ డైరెక్టర్ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం వలంటీర్లు సమయ పాలన, క్రమశిక్షణ, భవిష్యత్తు ప్రణాళికలు వంటి లక్షణాలు కలిగి ఉండాలన్నారు. వలంటీర్లుగా కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించాలని చెప్పారు.

కార్యక్రమంలో రిజిస్ట్రర్ జి.సింహాచలం, రాధాకృష్ణ, ఓఎస్‌డీ రవికుమార్, కె కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

కొల్లిపర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని వల్లభాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంకు చెందిన బత్తుల సుశీల విజయవాడ నుంచి అంబులెన్స్‌లో వస్తుండగా వల్లభాపురం సమీపంలో కొల్లిపర చెందిన కారు విజయవాడ వెళుతూ ఢీకొంది. దీంతో సుశీలకు తీవ్రగాయాలయ్యాయి. 108లో ఆమెను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నత్రజని అధిక వినియోగంతో చీడపీడల ఉధృతి

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నత్రజని ఎరువులు అధికంగా వినియోగించడం వలన పంటకు చీడపీడల ఉధృతి అధికంగా ఉంటుందని వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని దొప్పలపూడి, మన్నవ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పైర్లను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నత్రజని ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. సిఫారసు మేరకు ఎకరాకు 15కిలోల పొటాష్ ఎరువు పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వరి పైరులో ఆకు చుట్టు పురుగు అధికంగా ఉందని దీనికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్ బృందం

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన తమిళనాడు బృందం

కొల్లిపర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు చెందిన బృందం ఆంధ్రప్రదేశ్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించింది. తమిళనాడులో కూడా ఈ అనుభవాన్ని ఉపయోగించుకునేందుకు మంగళవారం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం, తూములూరు గ్రామాల్లో తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు చెందిన బృందం పర్యటించి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న న్యూట్రీ గార్డెన్లు, కిచెన్ గార్డెన్లు, కూరగాయల పంటలను పరిశీలించారు. బృందం ఆరోగ్య, పోషణ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్, రైతులు, స్వయం సహాయక బృందాల మహిళలను కలిసి పంటల ఎంపిక, తోటల పరిమాణం, నేల సిద్ధం, కీటకాలు వ్యాధుల నియంత్రణ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. రసాయనరహిత కూరగాయల ప్రాధాన్యం, గ్రామస్థాయిలో న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటు చేయడం వల్ల వచ్చే ఆహార, పోషక భద్రత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్ థిమాటిక్ లీడ్స్ కృష్ణారావు, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


దసరా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, ఈవో లీలా కుమార్ తదితరులు

దసరా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పెదకాకాని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 తేదీ వరకు జరిగే దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కార్యాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల వాల్ పోస్టర్లు, బుక్‌లెట్లను ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆలయ అధికారులకు సూచించారు. శరన్నవరాత్రులలో శ్రీ భ్రమరాంబ అమ్మ వారిని శ్రీబాలా త్రిపురసుందరిదేవి, శ్రీగాయత్రీదేవి, శ్రీ అన్నపూర్ణదేవి, శ్రీకాత్యాయనిదేవి, శ్రీమహాలక్ష్మీదేవి, శ్రీలలితాత్రిపురసుందరీదేవి, శ్రీ కదంబ వనవాసినిదేవి, శ్రీసరస్వతీదేవి, శ్రీదుర్గాదేవి, శ్రీమహిషాసురమర్దిని దేవి, శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాలలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ఉప ప్రధాన అర్చక పేటేటి ధనమహేశ్వర ప్రసాదు, కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు వలివేటి మురళి, పెండ్యాల సురేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇందిరకు ఘన నివాళి


ఇందిర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమ, తదితరులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే దొడ్డపనేని ఇందిర వర్ధంతి మంగళవారం నిర్వహించారు. వహాబ్ చౌక్‌లోని విగ్రహానికి, యడ్లపల్లిలోని సమాధి వద్ద కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ, నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యేగా కృషి చేశారని, జిల్లా పరిషత్ చైర్మన్‌గా జిల్లాలో పలు గ్రామాల అభివృద్ధికి ఇందిర కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్, రాజశేఖరరెడ్డి, వెంకట్రామయ్య, ఆదిలక్ష్మి, మురళి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు కోడెల

● టీడీపీ నాయకుడు వీరవల్లి మురళి


అన్నదానం నిర్వహిస్తున్న మురళి తదితరులు

తెనాలి క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలోను పల్నాడు ప్రాంతాన్ని తీర్చిదిద్దడంలో మాజీ స్పీకర్, మంత్రి, డాక్టర్ కోడెల శివప్రసాద్ ప్రజల గుండెల్లో ఎప్పటికీ చిరస్మరణీయుడని సీనియర్ టీడీపీ నాయకుడు వీరవల్లి మురళి పేర్కొన్నారు. డాక్టర్ కోడెల వర్ధంతి సందర్భంగా జేఎంజే స్వధార్‌లో కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, రూపాయి డాక్టరుగా పల్నాడు ప్రాంత ప్రజల హృదయాలలో నిలిచిపోయిన కోడెల రాజకీయాల్లో అడుగిడిన తరువాత ఎన్నో సవాళ్లను, ఒత్తిడులను ఎదుర్కొని టీడీపీ విస్తరణలో అండగా నిలిచారన్నారు. హోంమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖల మంత్రిగా నవ్యాంధ్ర తొలి స్పీకర్‌గా 36ఏళ్ల రాజకీయ జీవితంలో తెలుగువారి జీవితాల్లో చెరగని ముద్ర వేశారని, ముఖ్యంగా పల్నాడు ప్రాంత రైతుల సాగు, తాగు నీటికోసం ఆయన జరిపిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో బొద్దులూరి వేణు, కనగాల నాగభూషణం, గొల్లపూడి సాయిగిరి, షేక్ సలామ్, ఎల్ఎంఎన్ ఖాదర్, నిజాం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీజీపీ ప్రసాదరావుకు ఘన నివాళి


మాజీ డీజీపీ ప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాజీ డీజీపీ బయ్యారపు ప్రసాదరావు 69వ జయంతి మంగళవారం రూరల్ మండ లం తేలప్రోలులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అంబేద్కర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు నివాళులర్పించారు. అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రభాకరరావు మాట్లాడుతూ, చిన్న గ్రామంలో జన్మిం చి ఐపీఎస్ అధికారి స్థాయికి ఎదిగిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. యువకులు ప్రసాదరావును ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి చేరాలని కోరారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఏపీపీ సునీల్‌కుమార్, ప్రభాకరరావు, ఇశ్రాయేలు, చిట్టిబాబు, రత్నం పాల్గొన్నారు.

చేబ్రోలు మండలంలో రక్షిత తాగునీటి పథకాల తనిఖీ

చేబ్రోలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లోని రక్షిత తాగునీటి పథకాల నిర్వహణను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.శ్రీనివాసరావు మంగళవారం తనిఖీలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో ఆయన పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వర్షాల కారణంగా గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పైపులైన్లలో ఎక్కడైనా లీకులు లేదా డామేజ్ ఉంటే వెంటనే సరిచేయాలని ఆదేశించారు. నీటి కాలుష్యానికి అవకాశం లేకుండా ప్రతిరోజూ ఫిల్లింగ్ ట్యాంకుల్లో రెసిడ్యువల్ క్లోరినేషన్ చేయడం తప్పనిసరి అని స్పష్టంచేశారు. నీటి పంపిణీ సమయంలో పంచాయతీ సిబ్బంది కాలినడకన తిరిగి లీకులు పరిశీలించాలని, గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నారాకోడూరు, సుద్దపల్లి, శేకురు గ్రామాల్లో ఆయన స్వయంగా పర్యటించి ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు, బోర్‌వెల్స్ పైపులైన్ లీకులు వాల్‌పిట్స్ శుభ్రతను పరిశీలించారు. ఇంకా ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అధికారులు స్వయంగా నీటిని తాగి పరిశీలించిన తరువాతే సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ జి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎస్‌కే అజీజ్, జి.శ్రీనివాసరావు, బి.ప్రశాంతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వాటర్ ట్యాంక్ ఆపరేటర్లు పాల్గొన్నారు.


వినుకొండ బోసుబొమ్మ సెంటర్‌లోని ప్రసన్నరామలింగేశ్వరస్వామి దేవాలయం

● నిత్యకైంకర్యాలకు నోచుకోని వైనం ● ఆక్రమణల్లో ఆలయాల భూములు ● పూర్వవైభవానికి నోచుకోని దేవాలయాలు


పాత శివాలయ ఆవరణలో అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయం

దేవుళ్లకు.. నైవేద్యాలు

వినుకొండటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అవి పురాతన దేవాలయాలు. మొక్కిన వారికి కొం గు బంగారం ఆలయాల్లోని దేవుళ్లు ఉన్నారు. పెద్దఎత్తున భూములు కూడా ఉన్నాయి. వినుకొండలోని ఆయా ఆలయాల్లో దేవుళ్లకు నైవేద్యాలు పెట్టేవారే లేరు. దేవదాయ శాఖ ఈ ఆలయాల్లో నిత్యకైంకర్యాలు జరగడంలేదు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పేరుగాంచిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంతో పాటు పట్టణంలోని పాతశివాలయం, కోదండరామస్వామి ఆలయాలు చారిత్రాత్మక ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. కొండపై రామలింగేశ్వ రస్వామి ఆలయానికి 11 ఎకరాలు, ప్రసన్నరామలిం గేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలకి 65 ఎకరాలు, తిమ్మాయపాలెం రోడ్డులోని రంగనాయక స్వామి దేవాలయానికి 35 ఎకరాలకు అప్పట్లో భక్తు లు సమర్పించారు. కోదండరామస్వామి ఆలయానికి 1920లో 1460 ఎకరాలు భూమి ఉన్నాయని ఆధారాలు ఉండగా ఆక్రమణలు పోను ప్రస్తుతం కేవలం 65 ఎకరాలకు మాత్రమే ఉన్నాయి. ఈ దేవాలయాలకు నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. భక్తులు సమర్పించే కానుకలు, చందాల రూపంలో దేవాలయాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వయంగా శ్రీరాముడు శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతుంది. 11 ఎకరాల భూమి ఉన్నా స్వామివారు దూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయ పునః నిర్మాణ కార్యక్రమంలో భాగంగా శ్రీరాముడు నిర్మించిన ఆలయాన్ని తొలగించారు అప్పటి నుంచి ఆలయం పునఃనిర్మాణానికి నోచుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామి సన్నిధిలో హోమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ముందుకు సాగడంలేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ఆలయ పనులు చేపడతామని దేవాదాయ శాఖ అధికారి సుధాకరరెడ్డి తెలిపారు.


కొండపై అసంపూర్తిగా నిలిచిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం

పాపం.. జ్యోతి

● మూడేళ్ల వయసు నుంచి అంధత్వం
● అండగా ఉన్న తల్లీతండ్రి మృతితో రోడ్డున పడిన వైనం
● ఎనిమిదేళ్ల కుమారుడి పోషణ కోసం భిక్షాటన
● సీఎం కరుణ కోసం అభాగ్యురాలి ఎదురు చూపులు


కుమారుడు సహాయంతో రోడ్డు మీద బిక్షాటన చేస్తున్న పాములపాటి జ్యోతి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

జీవితమంతా కష్టాలే అంటే పాములపాటి జ్యోతి జీవితమే నిదర్శనంగా కనిపిస్తోంది. పుట్టిన మూడేళ్లకే కళ్లు పోయాయి. కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లిదండ్రులు హఠాత్తుగా మరణించారు. చేదువాదోడుగా ఉంటాడులే అనుకుని ఓ వ్యక్తి చెయ్యి పట్టుకుంటే బిడ్డ కడుపులో పడగానే వదిలేసి పత్తాలేకుండా పోయాడు. ఇప్పుడు ఆమె నడి రోడ్డు మీద ఉంది. ఎనిమిదేళ్ల బిడ్డను పోషించుకునేందుకు లోకాన్ని సరిగా చూడలేని ఆ తల్లి నానాయాతన పడుతుంది. మేడికొండూరు గ్రామానికి చెందిన జ్యోతి(ప్రస్తుతం గుంటూరులోని పాతగుంటూరు కృష్ణ కల్యాణ మండపం దగ్గర నివాసం ఉంటుంది) మూడేళ్ల వయసులో ఆడుకుంటూ కింద పడటంతో చూపు కోల్పోయింది. అప్పటి నుంచి తండ్రి మల్లేశ్వరరావు, తల్లి రమాదేవి కళ్లు లేని జ్యోతికి కళ్లుగా మారారు. 2007లో తండ్రి మల్లేశ్వరరావు గుండెపోటుతో మరణించిన తర్వాత జ్యోతి తల్లి మీదనే ఆధారపడ్డారు. 2018లో తల్లి రమాదేవి కూడా మరణించటంతో జ్యోతి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తల్లి, తండ్రి మరణించిన తర్వాత పూర్తి అయోమయ స్థితిలో ఉన్న జ్యోతిని వివాహం చేసుకునేందుకు ఓ వ్యక్తి ముందుకు వచ్చాడు. పెళ్లి చేసుకుని కొద్ది రోజులు కాపురం చేసిన తర్వాత చెప్పా పెట్టకుండా వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పటికే తాను గర్భం దాల్చానని బాధితురాలు చెబుతున్నారు. అబార్షన్ చేయించుకోవాలని చాలామంది సలహా ఇచ్చినా జ్యోతి అంగీకరించలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత రక్షణకుమార్ అని పేరు పెట్టినట్టు వెల్లడించారు.

బిడ్డ కడుపు నింపటానికి బిక్షాటన...

ప్రస్తుతం పాత గుంటూరు కృష్ణ కల్యాణ మండపం సమీపంలోనిఅద్దె ఇంట్లో నివసిస్తున్న జ్యోతి ఎనిమిదేళ్ల బాబును పోషించుకునేందుకు బిక్షాటన చేస్తున్నారు. బిక్షాటన చేయగా వచ్చిన సొమ్ముతోనే బాబును పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడ 'అడుక్కునే వాళ్లు' అనే పేరుతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తన బిడ్డను చిన్నచూపు చూస్తున్నట్లు జ్యోతి కన్నీళ్లు పెట్టుకున్నారు. ఒక్కో రోజు రోడ్డు మీదకు వెళ్లాలంటే చాలా భయం వేస్తుందని ఆవేదన చెందుతున్నారు. 'రూపాయి ధర్మం చేయమని అడిగితే కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తారని వాపోయారు.

సీఎం కలవాలని ప్రయత్నం చేసినా...

జ్యోతి బయటకు రావాలంటే కచ్చితంగా ఎవరో ఒకరి సాయం ఉండాల్సిందే. అటువంటి పరిస్థితిలో కూడా మూడు, నాలుగు సార్లు సీఎంను కలవడానికి వెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధితురాలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ దగ్గరికి వెళ్లినా కూడా అదే అనుభవం ఎదురైందని చెబుతున్నారు.

సీఎం సర్ కనికరించాలి...

ఇప్పటి వరకు ఎన్నో కష్టాలు పడ్డాను. ఇక నా వల్ల కావడం లేదు. సీఎం సర్ దృష్టికి నా విషయం వెళ్తే ఆయన కచ్చితంగా న్యాయం చేస్తారు అన్న నమ్మకం నాకు ఉంది. ప్రస్తుతం ఆయన ఇచ్చే ఆరు వేలు పెన్షన్‌తోనే ఇంటి అద్దె మూడు వేలు, కరెంట్ బిల్లు వెయ్యి చెల్లించి జీవిస్తున్నాను. సీఎం స్పందించి ఇల్లు, బిడ్డ చదువుకి సాయం చేస్తే ప్రశాంతంగా ఉండగలుగుతాను. ఆర్థిక సహాయం చేయాలనుకుంటే 8341233852 నెంబర్‌లో సంప్రదించండి.

-పాములపాటి జ్యోతి, బాధితురాలు

అమ్మా...ఎలా ఉన్నారు?

● అతివల ఆరోగ్యంపై 17 నుంచి ప్రత్యేక శిబిరాలు
● బలమైన కుటుంబానికి పునాది లక్ష్యంతో ముందుకు

సత్తెనపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమే కాదు ఆరోగ్య వంత మైన సమాజం నెలకుంటుంది. మహిళల ఆరోగ్యం బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. అందులోనే పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ ఐతే తీసుకోవాల్సిన చికిత్స పై వివరిస్తారు. రుగ్మతలు ఎలా వ్యాప్తి చెందుతాయో, వాటి భారిన పడకుండా అప్రమత్తంగా ఉండటం పై అవగాహన కల్పిస్తారని వైద్యులు తెలిపారు.

వైద్యుల పర్యవేక్షణలో...

గ్రామీణ, పట్టణాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేస్తారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లలో ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించేలా ఆయా ఆస్పత్రుల వైద్యులకు సూచించారు.

ఏఏ అంశాల పై పరీక్షలు చేస్తారంటే...

అధిక రక్త పోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. మహిళల్లో రక్త హీనత ఎలా వస్తుంది?, దానిని అధిక మించటం ఎలా?, తీసుకోవాల్సిన ఆహారం పై కౌన్సిలింగ్ ఇస్తారు. గర్భిణీల్లో హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు చేస్తారు. శిశు రక్షణ కార్డుల పంపిణీ, పిల్లలకు రోగ నిరోధక శక్తి అందించటం పై అవగాహన కల్పిస్తారు. కౌమార దశలో ఉన్న బాలికలకు రుతు పరిశుభ్రత, పోషకాహార కార్యక్రమం పై అవగాహన కల్పిస్తారు. చెక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించటంపై మహిళా స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ రాజ్ సంస్థలు, మహిళా ప్రతినిధులతో సమావేశాలు, పోషకాహారం పై సూచనలు ఇస్తారు.



అమరావతి బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు
మట్టి నమూనాల సేకరణ

● చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమానులో కొనసాగుతోన్న డ్రిల్లింగ్ వర్క్స్
● శాంపిల్స్ టెస్టింగ్‌కు హరియాణాలోని గురుగ్రాంకు రవాణా
● ఎలైన్‌మెంట్‌పై రకరకాల ఊహాగానాలు

గుంటూరు, వట్టిచెరుకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై వయా అమరావతి రాజధాని హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి ప్రాథమికంగా అవసరమైన ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) గుంటూరు జిల్లాలో ప్రారంభ మైంది. ఇందులో భాగంగా డీపీఆర్ రూపకల్పన, ఫైనల్ ఎలైన్‌మెంట్ డిజైన్, ట్రాఫిక్ సర్వే రిపోర్టు, ఆర్‌వోఆర్ లెక్కలు, సవివర అంచనాలు, ఈపీసీ తయారు చేయడం వంటివి చేపట్టారు. అలానే టెరెస్టియల్ లిడార్ సర్వే(గ్రౌండ్ బేస్డ్ లేజర్ సర్వే) కూడా చేపట్టనున్నారు. ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో భారీ యంత్రాలను ఉపయోగించి మట్టి నమూనాలను సేకరిస్తోన్నారు. దాదాపుగా 20 మీటర్ల లోతు వరకు వెళ్లి ప్రతీ ఐదు మీటర్లకు ఒకసారి మట్టి నమూనాని తీసుకొని ప్యాకెట్లలో నింపి వాటిని టెస్టింగ్ నిమిత్తం హరియాణ రాష్ట్రంలోని గురుగ్రాం లేబొరేటరీకి రవాణ చేస్తోన్నారు. దీంతో ఎలైన్‌మెంట్ ఏ ఊళ్ల మీద నుంచి ఉంటుందనే ఆసక్తి సర్వత్రా నెలకొన్నది.


వట్టిచెరుకూరు మండలంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం జరుగుతున్న మట్టి నమూనాల సేకరణ

దేశంలో మొట్టమొదటి హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ అయిన అహ్మదాబాద్ - ముంబై సెక్షన్ పూర్తి కావొస్తోండటంతో ఎన్‌డీఏ-3 ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టుల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ - అమరావతి - చెన్నై సెక్షన్‌లో దీనిని నిర్మించాలని ఇప్పటికే ప్రాథమికంగా నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. అక్కడి నుంచి ఎయిర్‌పోర్టు మీదగా హైదరాబాద్ - చెన్నై ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని ఎలైన్‌మెంట్ చేయాలని ప్రతిపాదించింది. ఆ మేరకు ఇప్పుడు సర్వే జరుగుతోన్నది. ఇందుకోసం 744.57 కిలోమీటర్ల సెక్షన్‌ని ఎంపిక చేశారు. ఫ్యూచర్ సిటీ నుంచి ప్రారంభమై శంషాబాద్, నార్కెట్‌పల్లి, సూర్యపేట, కోదాడ, అమరావతి రాజధాని, గుంటూరు, చీరాల మీదగా చెన్నైకి ఎలైన్‌మెంట్ చేయాలని భావిస్తోన్నారు.

కాగా ప్రస్తుతం చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో మట్టి శాంపిల్స్ తీస్తుండటంతో ఎలైన్‌మెంట్‌పై విస్తృతంగా చర్చలు జరుగుతోన్నాయి. రైల్వే శాఖ ప్రస్తుతం ఉన్న రైలుమార్గానికి సమాంతరంగా ప్రాజెక్టు చేపడితే భూసేకరణ ఖర్చు కొంతమేరకు తగ్గుతుందని సూచించింది. అయితే చేబ్రోలు, వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల్లో శాంపిల్స్ తీస్తున్న దృష్ట్యా ప్రస్తుత రైలుమార్గానికి సమాంతరంగా కాకుండా వేరే ఎలైన్‌మెంట్‌లో చేస్తున్నట్లు స్పష్టమౌతుంది. ఇందుకు కారణం పైన పేర్కొన్న మూడు మండలాల్లో ఎలాంటి రైలుమార్గం లేదు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే అమరావతి మీదగా గుంటూరు వచ్చిన తర్వాత చేబ్రోలు మండలంలోని గొడవర్రు, వట్టిచెరుకూరులోని అనంతవరప్పాడు మధ్యగా లేమల్లెపాడు తూర్పు వైపున కొంతదూరం వెళ్లాక ముట్లూరుకు పడమర వైపు నుంచి కాకుమాను మండలంలోకి వెళుతుంది. ప్రస్తుతం సేకరిస్తున్న మట్టి నమూనాల పరీక్ష ఫలితాలు పాజిటివ్‌గా వస్తే ఎలైన్‌మెంట్ ఇటువైపు నుంచే ఉంటుంది.

దళితవాడల్లో వెయ్యి ఆలయాలు!

● మత మార్పిడులను అడ్డుకునేందుకే టీటీడీ పాలక మండలి నిర్ణయం ● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రంలోని దళితవాడల్లో తొలి దశలో వెయ్యి ఆలయాలను నిర్మించాలని టీటీడీ పాలక మండలి నిర్ణయించింది. దళితవాడల్లో జరుగుతున్న మతమార్పిడులు అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆయా ప్రాంతాలను బట్టి రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షల చొప్పున శ్రీవాణి ట్రస్టు నిధులు కేటాయిస్తామని తెలిపింది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం మధ్యాహ్నం పాలక మండలి సమావేశం జరిగింది. చైర్మన్ బీఆర్ నాయుడు బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించి ఆ తర్వాత ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలక మండలి ఏర్పడ్డాక ఇవే తొలి బ్రహ్మోత్సవాలని.. ప్రతిష్ఠాత్మికంగా తీసుకుని అత్యంత వైభవంగా, దిగ్విజయంగా జరపాలని తీర్మానించామని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. 'రద్దీ నియంత్రణ కోసం తొలిసారి ఇస్రో సహకారం తీసుకోవాలని నిర్ణయించామని, ప్రతినిమిషం వారు రద్దీని పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తూ సందేశాలిస్తారు. ఎల్ అండ్ టీ సంస్థ కూడా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌కు సహకరిస్తుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా పది రోజులపాటు సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశాం. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకే వీఐపీ బ్రేక్ దర్శనాలుంటాయి. వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, ఎన్నారైలకు ప్రత్యేక దర్శనాలు నిలిపివేస్తాం. భక్తులకు కావలసినన్ని లడ్డూలు ఇచ్చేలా అదనంగా 8 లక్షల లడ్డూలు తయారు చేయాలని నిర్ణయించాం. 28వ తేదీన గరుడ వాహనసేవ రోజు 3 నుంచి 4 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ రోజు శ్రీవారిమెట్టు, అలిపిరి కాలి నడక మార్గంలో 24 గంటల పాటు భక్తులను అనుమతిస్తాం' అని వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని, 24వ తేదీన మీన లగ్నంలో (సాయంత్రం 5.43-6.15 గంటల మధ్య) ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహన సేవ జరుగుతుందన్నారు. అదే రోజు రాష్ట్రప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. 2026కు సంబంధించిన టీటీడీ డైరీ, క్యాలెండరు ఆవిష్కరించడంతో పాటు మరుసటి రోజు తిరుమలలో నూతనంగా నిర్మించిన పీఏసీ-5 (వెంకట్రాది నిలయం)ను ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. బ్రహ్మోత్సవాలను మహాయజ్ఞంగా నిర్వహించేందుకు బోర్డు సభ్యులు, అధికారులు, భక్తులు సహకరించాలని కోరారు.

మరికొన్ని నిర్ణయాలు..

- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరంలో ఉన్న శ్రీవారి ఆలయంలో రాజగోపురం, ముఖమండపం, సుబ్రహ్మణ్యస్వామికి ఆభరణాలు, తాగునీటి సౌకర్యం కోసం రూ.7.20 కోట్లు.
- అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆలయ పుష్కరిణి, కల్యాణ వేదిక, రాజ గోపురం, తోరణం నిర్మాణానికి రూ.5.73 కోట్లు మంజూరు.
- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో రూ.89.54 లక్షల విలువైన 74 సెంట్ల భూమిని కొనుగోలు చేసి టీటీడీకి విరాళంగా ఇచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన వెంకట్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి ముందుకొచ్చారు. ఆ విరాళం స్వీకరించేందుకు ఆమోదం. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే జైలుకే

టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బీఆర్ నాయుడు హెచ్చరించారు. 'పనీపాటా లేకుండా ప్రతి చిన్న విషయానికీ టీటీడీపై ఇష్టానుసారం అవాకులు చవాకులు పేలుతున్నారు. అందుకే ఇకపై తప్పుడు ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు పెట్టేలా బోర్డులో తీర్మానించాం. శ్రీవేంకటేశ్వరస్వామిపై రోజూ ఏదో ఒక అవాస్తవంతో దుమ్మెత్తిపోస్తున్నారు. చిన్న విషయాలను పెద్దవిగా చేసి టీటీడీ పరువు ప్రతిష్ఠలను దెబ్బతీస్తున్నారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టి న్యాయవిచారణ చేయించి జైలుకు పంపుతామని చెప్పారు. వేద పారాయణదారుల పోస్టు భర్తీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

ఏపీలో 25వ భారత్ రంగ్ మహోత్సవ్

● వచ్చే ఏడాది ఫిబ్రవరి 6,7,8,9,10 తేదీలలో జాతీయ, అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు
● వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోని అతి పెద్ద అంతర్జాతీయ థియేటర్ ఫెస్టివల్ 'భారత్ రంగ్ మహోత్సవ్ 2026' కు ఆంధ్రప్రదేశ్ వేదిక కానున్నట్లు తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అన్నారు. యడ్లపాడులోని వేదిక కార్యాలయంలో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ భారత రంగ్ మహోత్సవ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం(వేదిక)ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. గుంటూరుపట్టణంలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో ఈ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. దక్షిణ భారతదేశంలో తొలిసారి అదీ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్సవాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని, దాని నిర్వహణ బాధ్యతలు వేదికకు దక్కడం గర్వకారణమన్నారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో జాతీయ, అంతర్జాతీయ నాటక ప్రదర్శనలు, తెలుగు రాష్ట్రాల కళాకారులచే వివిధ కళారూపాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ నాటక మహోత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నాటకరంగ ప్రముఖులు, కళాకారులు, నాటకరంగ అభిమానులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని అన్ని కళాపరిషత్‌ల నిర్వాహకులకు, నాటక దర్శకులు, రచయితలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని నాటక సమాజాలవారికి, వివిధ రంగాల్లోని ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వా నాలు అందజేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఈ అంతర్జాతీయ ఉత్సవం జరగడం మనందరికీ గర్వకారణం అని తెలుగు నాటక రంగానికి ఈ ఉత్సవాలు కొత్త ఊపును ఇస్తాయన్నారు. కళా ప్రియులకు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ, విజయవంతం చేయడంపై వేదిక సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో వేదిక కార్యవర్గ సభ్యులు వీవీ మల్లిఖార్జునరావు, జేవీ మోహనరావు, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి, పోపూరి నాగేశ్వరరావు, కట్టా శ్రీహరి, నడింపల్లి వెంకటేశ్వర్లు, ముత్తవరపు రామారావు, లావు వెంకటేశ్వర్లు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం, యడ్లపాడు, కొండవీటి కళా పరిషత్, లింగారావుపాలెం, కల్లూరి నాగేశ్వర రావు కళాపరిషత్, వరగాని, శ్రీకారం రోటరీ కళా పరిషత్, మార్టూరు, ఎన్టీఆర్ కళాపరిషత్, అనంతవరం, గుంటూరు కళాపరిషత్, గుంటూరు, కాసరనేని సదాశివరావు కళాపరిషత్, తక్కెళ్ళపాడు, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్, సాతులూరు, కళా నికేతన్, వీరన్నపాలెం, ఎన్టీఆర్ కళాపరిషత్, వినుకొండ, పెదకంచర్ల గ్రామీణ కళాపరిషత్, పెద కంచర్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు